చిందులేసిన 'జానపదం'



- ఆకట్టుకున్న యక్షగానం
- కళాకారులకు మంత్రి ప్రశంస
- నిర్మల్‌లో సోమవారం ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా తెలంగాణ జానపద కళాజాతర

యక్షగాన ప్రదర్శనిస్తున్న ధని కళాకారుల బృందం **5**

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



20 నిర్మల్

మంగళవారం 29 ఆగస్టు 2017

- రైతుల సేవా సమితిల ఏర్పాటుకు సన్నాహాలు
- సెప్టెంబరు 9లోగా సమితి కార్యవర్గాల నియామకాలు
- నామినేటెడ్ పద్ధతుల్లో పదవుల భర్తీ
- గ్రామస్థాయిలో 15, మండల స్థాయిలో 24 మందికి అవకాశం
- జిల్లా ఇన్‌చార్జిగా మంత్రి అల్లోల
- ఆయన నేతృత్వంలోనే నియామక ప్రక్రియ
- భూముల సర్వేలో కీలకం కానున్న కమిటీ ధ్రువీకరణలు

'కారు'లో.. పదవుల పందేరం





9

గత మూడున్నరేళ్ళ నుంచి పదవుల కోసం ఎదురుచూస్తున్న అధికార టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఊరట లభించబోతోంది. ప్రభుత్వం భూముల అవకతవకలను నిరోధించేందుకు గ్రామస్థాయి నుంచి సమగ్ర భూ సర్వే చేపట్టేందుకు నిర్ణయించింది. అయితే ఈ సర్వే ఆయా గ్రామ స్థాయిలో నియమించబోయే రైతు సేవా సమితిల నేతృత్వంలో జరగనుంది. ఇక నుంచి భూముల యాజమాన్యాల నిర్ధారణ ఆయా గ్రామాల్లో నెలకొన్న భూ వివాదాల పరిష్కారం లాంటి వ్యవహారాలన్ని రైతు సేవా సమితిల పరిధిలోకి రాబోతున్నాయి. గ్రామాల్లోని రైతు సేవా సమితిల భూ యాజమాన్యాలను నిర్ధారించిన తరువాతనే రెవెన్యూ అధికారులు పట్టాదార్ పాస్ పుస్తకాలతో పాటు పహానీ, తదితర యాజమాన్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేయనున్నారు. దీని కోసం గాను సెప్టెంబరు 9వ తేదీలోగా గ్రామ, మండల, జిల్లాస్థాయి రైతు సేవా సమితిలను నియమించబోతున్నారు.

(ఆంధ్రజ్యోతి, నిర్మల్)



దేవరకొండలో పూజలు నిర్వహిస్తున్న పండితులు(ఫైల్)

సమగ్ర విచారణ ఎప్పుడో?

- బాసర ఆలయ విగ్రహ ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న దేవాదాయ శాఖ
- మంత్రి ఆదేశించి 20 రోజులు గడిచినా మొదలు కాని విచారణ
- ఇంకా అజ్ఞాతంలోనే పండితుడు
- కనిపించని దేవరకొండ పూజలో పాల్గొన్న మరో ఇద్దరు పండితులు

8

జిల్లాలోని బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం నుంచి విగ్రహాన్ని తీసుకెళ్లి నల్గొండ జిల్లా దేవరకొండలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆలయ పండితులు పూజలు నిర్వహించిన తీరు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. గత నెల 28వ తేదీన జరిగిన ఈ ఘటనపై ఇంకా అనేక అనుమానాలు, ఆరోపణలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. ఆలయం నుండి విగ్రహం తీసుకెళ్ళినప్పటి నుండి పూజలు నిర్వహించి అనంతరం ఆలయంలో పండితులు యథాస్థానంలో విగ్రహాన్ని ఉంచేంత వరకు ఆలయ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

ఆలయంలో పంచనామా నిర్వహించి విగ్రహం దొరికి నప్పటికి విచారణలో జాప్యం చేస్తున్నారని, పండితుడు ఇంకా అజ్ఞానంతో ఉన్న విషయం పై ముందడుగు పడడం లేదు

'కడెం' లోకి కొనసాగుతున్న వరదనీరు



- ప్రాజెక్టులోకి 4971 క్యూసెక్కుల వరద నీరు
- పూర్తి సామర్థ్యం 700 అడుగులు
- ప్రస్తుతం 698.4 అడుగుల నీటిమట్టం
- ఒక వరద గేటు ఎత్తి 5,200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలిన అధికారులు

9

మరణించాడనుకుని పెద్దకర్మకు ఏర్పాట్లు



- ఆరు నెలల క్రితం కనిపించకుండా పోయిన వ్యక్తి
- తమ వాడే అనుకుని అనాథ శవానికి అంత్యక్రియలు
- పెద్దకర్మకు ఏర్పాట్లు
- బంధువుల సమాచారంతో ఇంటికి రావడంతో కర్మ రద్దు
- ఊపిరిపీల్చుకున్న కుటుంబీకులు

3

నేడు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి రాక **4**

ఇంటర్వ్యూ I.N.T.E.R.V.I.E.W

ప్రమాదరహిత జిల్లానే లక్ష్యం..

- ఎన్. కిష్టయ్య, మంచిర్యాల జిల్లా రవాణా శాఖ అధికారి



మందమర్రి : కొత్తగా ఏర్పడ్డ మంచిర్యాల జిల్లాను ప్రమాదరహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామనీ, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా రవాణాశాఖ అధికారి ఎన్ కిష్టయ్య సూచించారు. వాహనదారులంతా ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలనీ, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి : రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అనేక చర్యలు తీసుకుంటున్నాం. ట్రాఫిక్ నియయాలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు సూచిస్తున్నాం. రోడ్డు భద్రతా వారోత్సవాలు, ఇతరత్రా సందర్భాల్లో ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ద్విచక్రవాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలని, కారులో ఉన్నవారు సీటు బెల్టు పెట్టుకోవాలనీ, ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదనీ, మితి మీరిన వేగం ప్రమాదాలకు కారణమని చెబుతున్నాం. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలు ఎలా జరుగుతాయో ఛాయాచిత్ర ప్రదర్శన, నృత్య నాటికల ద్వారా తెలియజేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేసే వాహనాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

అధికారి : ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకొని ఓవర్ లోడ్ వాహనదారులపై చర్యలు తీసుకుంటున్నాం. పరిమితికి మించి ప్రయాణికులను తరలించే ప్రైవేట్ వాహనాలు, ముఖ్యంగా ఆటోడ్రైవర్లకు అవాహన సదస్సులు ఏర్పాటుచేస్తున్నాం. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, ఓవర్ లోడ్ వల్ల జరిగిన ప్రమాదాలు, ప్రాణనష్టం గురించి వివరిస్తున్నాం. అప్పటికీ నిబంధనలు లెక్క చేయకుండా ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాల పర్మిట్ రద్దు చేయడంతోపాటు వాహనాలను సీజ్‌చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఇలాంటి వాహనాలపై ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదు చేశారు ?

అధికారి : ఇప్పటివరకు జిల్లాలో 300కు పైగా ఓవర్‌లోడ్ వాహనాలపై కేసులు నమోదు చేశాం. వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని పై అధికారులకు ఫిర్యాదు చేశాం. ఫిట్‌నెస్ లేని వాహనాలను నడపకుండా ముందస్తు సీజ్ చేస్తున్నాం. కేసులు నమోదవుతున్న దృష్ట్యా చాలా మంది ఓవర్‌లోడ్ లేకుండా జాగ్రత్త పడుతున్నారు.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఎన్ని వాహనాలున్నాయి?

అధికారి : జిల్లాలో దాదాపు లక్షకు పైగా ద్విచక్ర వాహనాలు, 450 బస్సులు, 500 లారీలు, 90 స్కూలు బస్సులు, పదివేల కార్లు, పదివేల దాకా ఇతర వాహనాలున్నాయి. రవాణా వాహనాలకు తప్పనిసరిగా ఏడాదికోసారి ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తాం. ఫిట్‌నెస్ పరీక్షలు చేసుకోకుండా నడిపితే సీజ్ చేస్తాం.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో అపరాధరుసుములు ఏ విధంగా విధిస్తున్నారు? ఇప్పటివరకు ఎంత వసూలు చేశారు?

అధికారి : జిల్లాలో నిబంధనలు పాటించని వాహనదారుల నుంచి ఈ ఏడాది ఇప్పటివరకు కోటి రూపాయలకు పైగా అపరాధ రుసుము వసూలు చేశాం. వాటిని వాహన పన్నుల పద్దు విభాగంలో రోజూ జమచేస్తుంటాం.

ఏకదంతం పాస్మహే!

- గణపతి దీక్షకు పెరుగుతున్న ఆదరణ
- మాలధారణతో ఆధ్యాత్మిక చింతనలో యువత



ఆలయంలో గణపతి



గణపతిని దర్శించుకుంటున్న స్వాములు

నస్పూర్ : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత సాధ్యమని నమ్ముతున్న యువత దీక్షలవైపు మొగ్గుచూపుతున్నది. ఈ క్రమంలో గణపతి దీక్షకు జిల్లాలో ఆదరణ పెరుగుతున్నది. మాలధారణ చేసిన భక్తులు, ఉపవాసం, నిత్యపూజలతో ఏకదంతుడిని కొలుస్తున్నారు. రకరకాల వ్యసనాలకు వదిలించుకునేందుకు దీక్ష ఒక మార్గమనీ, నైతిక జీవితానికి కావాల్సిన మానసిక స్థైర్యం అలవడుతుందని నమ్మకంగా చెబుతున్నారు.

వినాయక నవరాత్రులను పురస్కరించుకొని జిల్లాలో పెద్దసంఖ్యలో యువకులు, గణపతి దీక్ష స్వీకరించారు. నస్పూర్ మండలం హౌజింగ్ బోర్డు కాలనీ శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో అర్ధమండల దీక్షల్లో భాగంగా పలువురు మాలధారణ చేశారు. ఈ ఆలయ పరిధిలో దశాబ్ద కాలంగా దీక్షలు కొనసాగుతుండగా, ప్రస్తుతం వివిధ పట్టణాలు, గ్రామాలకూ విస్తరించాయి. వీరంతా వచ్చే నెల 4న మాల విరమణ చేస్తారు. ఈ సందర్భంగా దీక్షా నియమాలు, దీక్ష వల్ల కలిగే ప్రయోజనాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

దీక్షా నియమాలు.. ప్రయోజనాలు

- దీక్షలో భాగంగా ఉదయం చన్నీటి స్నానం ఆచరించాలి.
- అనంతరం సూర్యనమస్కారాలు చేయాలి. 'ఓం గణపతియే నమః' అంటూ మనస్సులో ప్రార్థించాలి.
- నేలపై మాత్రమే నిద్రించాలి.
- రోజుకు ఒక్క పూట మాత్రమే భోజనం చేయాలి.
- పాదరక్షలు లేకుండానే నడవాలి.
- కామం, క్రోధం, లోభం లాంటి అరిషడ్వర్గాలకు దూరంగా ఉండాలి.
- నిత్యం ఆధ్యాత్మిక చింతనలో గడపాలి.
- పాదరక్షలు లేకుండా నడవడం, నేలపై నిద్రించడం వల్ల రక్త ప్రసరణ సక్రమంగా జరిగి రక్తపోటు, గుండె జబ్బులు దూరమవుతాయి. శరీర రుగ్మతలు మాయమవుతాయి. రోజుకు ఒకే పూట భుజించడం వల్ల జీర్ణకోశ సమస్యలు కనుమరుగై, జీర్ణవ్యవస్థ అదుపులోకి వస్తుంది. ఉత్సాహం, ఉల్లాసం వెల్లివిరుస్తుంది. నిత్యం దైవ చింతనలో గడపడం వల్ల మనిషిలో ఉండే అహంకారం, ఇతర దుర్వ్యసనాలు దూరమవుతాయి. చన్నీటి స్నానం, సూర్యనమస్కారాల వల్ల యోగా చేసిన ఫలితం దక్కుతుంది.

కోర్కెలు నశిస్తాయి

- గంగారపు వంశీ కృష్ణ శర్మ, గురుస్వామి



గణపతి దీక్ష వల్ల కోర్కెలు నశిస్తాయి. ఆధ్యాత్మిక చింతనలో గడపడం, చన్నీటి స్నానాలు చేయడం, చెప్పులు లేకుండా నడవడం, ఒకపూట భోజనం వల్ల శరీరం అదుపులోకి వస్తుంది. దురలవాట్లు దూరమవుతాయి.

ఆధ్యాత్మిక చింతన..

- భాస్కర్, దీక్షాపరుడు



దీక్షల వల్ల ఆధ్యాత్మిక చింతన అలవడుతుంది. దురల వాట్లు దూరమవుతాయి. నియమనిష్ఠలవల్ల దైవాను గ్రహం లభిస్తుంది. అనుకున్న కార్యాలు నెరవేరుతాయి. అందుకే ఈ ఏడాది గణపతి దీక్ష స్వీకరించాను.

వ్యసనాలకు దూరం

- అభిరామ్, దీక్షాపరుడు



గణపతి మాలధారణ వల్ల మనిషి ప్రవర్తనలో మార్పులు వస్తాయి. వ్యసనాలకు దూరంగా ఉండవచ్చు. ఆరోగ్యం చేకూరుతుంది. నియమాలను నిష్ఠగా పాటిస్తే ఆ భగవంతుని కృపాకటాక్షాలు పొందవచ్చు.

ఆదిదేవుడు అయినందునే

- సతీష్, దీక్షాపరుడు



ఆదిదేవుడు అయినందునే గణపతి దీక్ష స్వీకరించాను. దీక్ష వల్ల భక్తిభావం పెంపొందుతుంది. మంచి ఆలోచనలు వస్తాయి. మంచి నడవడిక అలవడుతుంది. తలపెట్టిన కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగుతాయి.

ఆధ్యాత్మికం

బాధ్రపదం ఎంతో శ్రేష్ఠం

- దుద్దిళ్ల నారాయణశర్మ, వేదపండితులు శ్రీసత్యనారాయణస్వామి దేవాలయం, గూడెం



దండేపల్లి : శ్రావణ మాసం వెళ్లి బాధ్రపదం వచ్చింది. ఈ మాసం పూజలకు, పితృ దేవతారాధనకు ఎంతో శ్రేష్ఠమైంది. బాధ్రపదం చాంద్రమాసం ప్రకారం ఆరో నెల. ఈ మాసంలోని పౌర్ణమి తిథిన చంద్రుడు పూర్వ భాద్ర నక్షత్ర సమీపంలోగాని, ఉత్తరబాధ్ర నక్షత్ర సమీపంలోగాని ఉండడం వల్ల ఈ మాసానికి భాద్రపద మాసం అనే పేరు వచ్చింది. ఇది వర్ష రుతువులో రెండో నెల. భాద్రపద మాసంలోని శుక్ల పక్షం దైవ పూజలకు ప్రత్యేకం. కాగా కృష్ణపక్షం పితృ దేవతల ఆరాధనకు అత్యంత ప్రీతికరమైన కాలంగా పురాణాలు చెబుతున్నాయి. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం మహావిష్ణువు దశావతారాలు ఎత్తిన విషయం అందరికీ తెలిసిందే. దశావతారాల్లో మూడోదైన వరాహ అవతారాన్ని, ఐదోవదైన వామనావతారాన్ని ఈ మాసంలోనే ఎత్తి, దుష్టశిక్షణ గావించారు. అందుకే ఈ మాసంలోనే దశావతర వ్రతంగా చేయాలనేది శాస్త్ర వచనం. ఈ మాసంలో మహిళలు పలు వ్రతాలు పాటిస్తే మంచి ఫలితం ఉంటుంది. భాద్రపద శుక్ల పక్షం తదియ రోజు హరితాళిక వ్రతం లేదా, సువర్ణ గౌరీ వ్రతం చేయాలి. శివ పార్వతులను పూజించి పదహారు కుడుములు నైవేద్యంగా సమర్పించాలి. ఉండ్రాళ్ల తద్ది, వినాయకచవితి, పరివర్తన ఏకాదశి, వామన జయంతి, అనంతర చతుర్థి తదితర పండుగలు ఈ మాసంలోనే వస్తాయి. బాద్రపద మాసంలో భక్తులు పూజలు చేస్తే ఎంతో పుణ్యఫలం, మోక్షం కలుగుతుంది.

Employee Voice

ఉద్యోగి వాయిస్

ఉమ్మడి సర్వీస్ రూల్స్ తక్షణమే అమలు చేయాలి

జెలంపెల్లి శ్రీనివాస్, మంచిర్యాల జిల్లా డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి



మందమర్రి : ఉపాధ్యాయులకు సంబంధించిన ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను తక్షణమే అమలుచేయాలి. ఉద్యోగోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలి. జిల్లాలో ఉద్యోగోన్నతులు లేకపోవడం వల్ల ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెరుగుతున్నది. ఉద్యోగోన్నతులు లేకపోవడం వల్ల వేలాది మంది తమ సర్వీస్ కోల్పోవాల్సి వస్తున్నది. ఉద్యోగోన్నతుల అనంతరం ఏర్పడే ఖాళీలను కాలయాపన లేకుండా డీఎస్సీ ద్వారా భర్తీచేయాలి. తద్వారా ప్రభుత్వ విద్యారంగం మరింత బలోపేతమవుతుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఉన్నతీకరించిన ప్రతి యూపీఎస్, హెచ్‌ఎస్‌లలో పూర్తిస్థాయిలో బోధనాసిబ్బందిని నియమించాలి. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్నభోజనానికి సంబంధించి, విద్యార్థుల వివరాలను కులాలవారీగా అడుగుతున్నారు. ఈ నివేదికలు ఉపాధ్యాయులనూ, విద్యార్థులనూ మానసికంగా క్షోభకు గురిచేస్తున్నాయి. ఈ నిబంధనలను తక్షణమే రద్దు చేయాలి. పెన్షన్ అనేది ప్రతీ ఉద్యోగి హక్కు. సీపీఎస్ పెన్షన్ విధానం వల్ల ఉద్యోగ విరమణ తర్వాత పరిస్థితి దయనీయంగా మారుతుంది. సీపీఎస్ పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలి.

చనిపోయాడనుకొని పెద్దకర్మకు ఏర్పాట్లు

● ఆరు నెలల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయిన వ్యక్తి తిరిగి రాక ● చనిపోయాడనుకొని అంత్యక్రియలు పూర్తి



కుటుంబీకులతో రవీందర్‌రెడ్డి

భైంసారూరల్: ఆరు నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి మృతిచెందాడని అనుకొని కుటుంబీకులు అంత్యక్రియలు చేశారు. అనంతరం పెద్దకర్మకు ఏర్పాట్లను చేసుకున్నారు. కానీ పెద్దకర్మకు ఒకరోజు ముందే చనిపోయాడనుకున్న వ్యక్తి ఇంటి ముందు ప్రత్యక్షమయ్యాడు. దాంతో ఆ కుటుంబంలో ఆనందానికి అవధులు లేవు. ఈ ఘటన భైంసా మండలంలో చోటుచేసుకుంది. నిర్మల్ జిల్లా భైంసా మండలం కోతుల్‌గాం గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి ఆరు నెలల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రవీందర్‌రెడ్డి మందమతి కలవాడు. ఆయన ఆచూకీ కోసం కుటుంబీకులు ఆరా తీశారు. ఎక్కడా ఆయన ఆనవాళ్లు దొరకలేదు. శనివారం ఖానాపూర్ నియోజకవర్గం పెంబి బస్టాండ్‌లో అనాథ మృతి చెందాడు. పోలీసులు ఆ మృతదేహం వివరాలను మీడియాకు సమాచారం అందించారు. ఆదివారం దినపత్రికలో చూసిన రవీందర్‌రెడ్డి కుటుంబీకులు ఆ వివరాలన్ని ఆయనతో మృతిచెందిన అనాథ శవం రవీందర్‌రెడ్డి అని సరిపోల్చుకున్నారు. పెంబిలోని బంధువులకు సమాచారం ఇవ్వగా వారు పోలీసులను సంప్రదించారు. పూర్తి వివరాలను పోలీసులు వారి తెలియజేశారు. కుటుంబీకులు, బంధువులు వారు చెప్పినవి సరిపోల్చుకునే సమయంలో రెండు రోజులు గడిచిపోయాయి. మంగళవారం రవీందర్‌రెడ్డి కుటుంబీకులు పెంబి చేరుకుని పోలీసులను ఆశ్రయించగా అప్పటికే మృతిచెంది రెండురోజులపైనే కావడంతో పోలీసులు అంత్యక్రియలు పూర్తిచేశారు. అనంతరం కుటుంబీకులు సంప్రదాయంగా రవీందర్‌రెడ్డి అంత్యక్రియలు పూర్తిచేశారు. సోమవారం పెద్దక ర్మకు ఏర్పాట్లను చేస్తున్నారు. రవీందర్‌రెడ్డి నిర్మల్ లో కోతుల్‌గాం గ్రామానికి చెందిన వ్యక్తికి కనిపించి పలకరించాడు. దాంతో ఆ వ్యక్తి జరిగిన విషయం చెప్పి వెంటనే కోతుల్‌గాంకు తీసుకెళ్లాడు. రవీందర్ రెడ్డి ఇంటికి చేరుకోగానే కుటుంబ సభ్యు లు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అయితే పెంబిలో అంత్యక్రియలు జరిపిన మృతదేహం ఎవరిదనే ప్రశ్న తలెత్తుతోంది.

బతికి ఇంటికి వచ్చాడు అదే పదివేలు



అంత్యక్రియలను పోలీసులు పూర్తి చేశారు. పెద్దకర్మకు ఏర్పాట్లను చేసుకున్నాం. అంతలోనే సోదరుడు తిరిగివచ్చాడు. మేము ఆనందంతో ఉన్నాం. సోదరుడు బతికి వచ్చాడు. అదే మాకు పదివేలు.

● పురుషోత్తంరెడ్డి, సోదరుడు

దర్యాప్తును చేపడుతాం

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు చేశాక రవీందర్‌రెడ్డి కుటుంబీకులు వచ్చారు. దీంతో భైంసా మండలం కోతుల్‌గాం గ్రామానికి చెందిన రవీందర్‌గా నిర్ధారించాం. ఇప్పుడు రవీందర్‌రెడ్డి సజీవంగా ఉన్నారంటే ఇక్కడ అంత్యక్రియలు జరిపిన మృతదేహం ఎవరిదో తెలుసుకోవడానికి దర్యాప్తును చేపడుతాం.

● సంజీవ్, ఎస్ఐ, పెంబి

రసాయన మందుల పిచికారీతో పలువురికి అస్వస్థత

భైంసా: నిర్మల్ జిల్లా భైంసా డివిజన్ పరిధిలో పంటలకు ఆశించిన తెగుళ్ల నివారణకు క్రిమిసంహారక రసాయన మందులను పిచికారి చేసే సమయంలో రైతులు జాగ్రత్త చర్యలు పాటించకుండా అస్వస్థతకు గురవుతున్న బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. సోమవారం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఐదుగురు అస్వస్థతతో ఆసుపత్రి పాలయ్యారు. ఇప్పటివరకు భైంసా ఏరియా ఆసుపత్రిలో 25 మందికిపైగా క్రిమిసంహారక మందులను పిచికారి చేయడంతోనే అస్వస్థకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం బాసరకు చెందిన సాయికుమార్(25), కుభీర్ మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన మంజూర్(30) అస్వస్థతకు గురై చేరారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

జాగ్రత్త చర్యలు పాటించాలి

● అమరేష్ కుమార్, ఏడీఏ భైంసా

క్రిమిసంహారక మందులను పిచికారి చేసే సమయంలో రైతులు తగు జాగ్రత్త చర్యలను తీసుకోవాలి. ఎలాంటి జాగ్రత్త చర్యలను పాటిం చకపోవడం మూలంగానే అస్వస్థత చెందుతున్నారు. పిచికారి సమయంలో తలకు హెల్మెట్ దరించాలి. చేతులకు రబ్బరు తొడుగులు వేసుకోవాలి.

పిచికారీ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు

- శరీరం మొత్తం కప్పి ఉంచే విధంగా దుస్తువులను ధరించాలి. ప్రధానంగా చేతులు, కాళ్లు, కళ్లకు రక్షణ కల్పించేలా జాగ్రత్త చర్యలు తీసుకోవాలి.
- పిచికారి సమయంలో హెల్మెట్ ధరించడం అన్నివిధాలా ప్రయోజనకరం.
- పిచికారి యంత్రాలు పనిచేయక పోతే నోటితో ఊదవద్దు.
- పిచికారి యంత్రాలను తాగే నీరు వద్ద, నల్లాల వద్ద ఎలాంటీ పరిస్థితిల్లోనూ కడగరాదు.
- శరీరంపై గాయాలుంటే క్రిమిసంహారక మందు తగల కుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- మందులు పిచికారి చేసిన సమయంలో ధరించిన దుస్తులను ప్రత్యేకమైన స్థలంలో సబ్బునీళ్లతో ఉతుక్కోవాలి.
- గాలికి వ్యతిరేక దిశలో మందును పిచికారి చేయవద్దు.
- క్రిమిసంహారక మందులను పిచికారి చేసిన తరువాత తప్పనిసరిగా స్నానం చేయాలి.
- పిచికారి సమయంలో తినడం, నీళ్లు తాగడం, పొగ తాగడం చేయరాదు.
- చేతులతో కళ్లను తుడుచుకోవడం చేయవద్దు.
- క్రిమిసంహారక మందులను పిచికారి చేసి అస్వస్థత చెందిన వారిని త్వరితగతిన సమీప ప్రాంతాల్లోని ఆసుపత్రులకు తీసుకు వెళ్లాలి.

తల్లి మందలించిందని కూతురు ఆత్మహత్య

నేరడిగొండ: తల్లి మందలించిందని కూతురు క్షణికావేశంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండ మండ లంలోని తేజాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగిడి శ్రీ య(16) తొమ్మిదవ తరగతి చదువుతోంది. ఆదివారం తల్లిదండ్రులు సింగిడి నర్సారెడ్డి, జ్యోతి తమ బంధువుల శుభకార్యానికి కూతురు శ్రీయతో కలిసి బోథ్ మండలంలోని పొచ్చెర గ్రామం దగ్గర ఉన్న పంక్షన్ హాల్‌కు వెళ్లారు. కూతురు శ్రీయను త్వరగా ఇంటికి తల్లి జ్యోతి పంపించింది. కార్యక్రమం ముగిసిన తర్వాత తల్లిదండ్రులు ఇంటికి రాగా శ్రీయ లేకపోవడంతో తల్లి శ్రీయను మందలించింది. దీంతో శ్రీయ క్షణి కావేశంలో ఇంటి దాబాపై ఎక్కి అక్కడే ఉన్న పురుగుల మందును తాగింది. తల్లి గమనించడంతో వెంటనే బోథ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిర్మల్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించగా 108లో తీసుకెళ్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. పోసుమార్టం నిర్వహించి మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేసారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకన్న తెలిపారు.



మృతి చెందిన సింగిడి శ్రీయ

చిన్నారి అతిథి మృతదేహం లభ్యం



అథితి మృతదేహం

జైనథ్: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండల సరిహద్దున గల పెన్‌గంగా నదిలో మూడేళ్ల కూతురు అతిథి, తల్లి స్వప్న ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన తెలిసిందే. స్వప్న మృతదేహం లభ్యమైంది. సోమవారం జైనథ్ ఎస్సై జి.పుల్లయ్య 20 మంది గజ ఈతగాళ్లతో పాప అథితి మృతదేహం కోసం గాలింపు చర్యలను నిర్వహించగా పెన్‌గంగా బ్రిడ్జీ నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో తుంగల్లో తట్టుకుని ఉన్న అథితి మృతదేహాన్ని ఈతగాళ్లు బయటకు తీశారు. ఎస్సై జి.పుల్లయ్య, ఆర్ఐ శ్రీవాణీ కలిసి శవపంచనామా నిర్వహించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జైనథ్ ఎస్సై జి.పుల్లయ్య పేర్కొన్నారు.

దొంగపట్టాతో భూమి కబ్జా

● కథనంపై జైనథ్ తహసీల్దార్ ప్రభాకర్ విచారణ

ఆంధ్రజ్యోతి ఏఫెక్ట్

జైనథ్: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని గూడ గ్రామపంచాయతీ పరిధిలోని రాంపూర్(టి) గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 76/ఎ/ఇలో ఉన్న 5.39 ఎకరాల భూమి కబ్జాకు గురైందని, దొంగపట్టాతో భూమి కబ్జా అనే శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. సోమవారం జైనథ్ మండల తహసీల్దార్ బొల్లెం ప్రభాకర్ రాంపూర్ గ్రామానికి వెళ్లి గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అల్లం భూదాబాయికి ఆయన తండ్రి లింగాల గంగన్న, ఆమె అన్న సాంబన్న సర్వేనెంబర్ 76/ఎ/ఇ లో ఉన్న 5.39 ఎకరాల భూమిని 1989లో రాసి ఇచ్చారన్నారు. దీనిపై జీపీలో వారం రోజులపాటు నోటీసులు అంటించామన్నారు. ఎలాంటీ ఫిర్యాదులు లేని కారణంగానే విరాసత్ కింద భూదాబాయికి పట్టాపాస్‌బుక్ టైటిల్ డీడ్‌ను అందజేశామన్నారు. ఇందులో ఎలాంటీ అవినీతి అక్రమాలకు తావులేదన్నారు. గుంజల వెంకటమ్మ తల్లి గుంజెల గంగమ్మకు ఈ భూమి చెందుతుందని అనవసరపు ఆరోపణలు చేయటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుభాష్, వీఆర్‌వోలు విజయలక్ష్మీ, శారదలతోపాటు రాంపూర్(టి) గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవలందించని వారికి ఉత్తమ అవార్డులా: కాంగ్రెస్

కడెం: మండలంలోని గ్రామాలలో రైతులకు సేవలందించని పశువైద్యాధికారికి విజయ్‌కు ఉత్తమ అవార్డులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని యువజన కాంగ్రెస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ సతీష్ రెడ్డి, రైతు విభాగం జిల్లా నాయకులు మల్లయ్య అన్నారు. కడెంలోని హరిత రిసార్ట్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. డాక్టర్ విజయ్ నిర్లక్ష్యం కారణంగా మండలంలో చాలా పశువులు మృత్యువాత పడ్డాయన్నారు. అలాంటి వ్యక్తికి ఉత్తమ అవార్డులు ఇవ్వడం సరైన పద్ధతి కాదన్నారు. రైతులకు డాక్టర్ ఎలాంటీ సేవలపే అందిస్తున్నాడో అధికారులు తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు. విధులు సక్రమంగా నిర్వహించని డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు గోల్ల వెంకటేష్, నాయకులు మధు, వాజీద్ ఖాన్, నర్సారెడ్డి, కన్నె శ్రీనివాస్, రాజేష్, కొమురయ్య, శంకర్, ఇమ్రాన్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్సీ కార్పొరేషన్ లబ్దిదారుల ఎంపికకు గ్రామ సభలు

దిలావర్‌పూర్: మండలంలోని గ్రామాల్లో 29, 30వ తేదిల్లో ఎస్సీ కార్పొరేషన్ లబ్దిదారుల ఎంపికకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మోహన్ రెడ్డి తెలిపారు. 29న నర్సాపూర్ (జి), రాంపూర్, కుప్లి, మాడేగాం, సాంగ్వి. 30న దిలావర్‌పూర్, గుండంపల్లి, సముందర్‌పల్లి, టెంబుర్ని, కొత్తలోలం, కాల్వ, లోకల్ వెల్మల్, కంజర్, బన్సపల్లి, సిర్గాపూర్‌గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్న వివరించారు. గ్రామ సభల్లో అర్హులైన వారినే ఎసీస కార్పోరేషన్ ద్వారా లబ్దిపొందేందుకు ఎంపీక చేస్తామని చెప్పారు.

నేడు నిర్మల్‌కు రానున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

(ఆంధ్రజ్యోతి, నిర్మల్)

రాష్ట్ర డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి నేడు నిర్మల్ జిల్లా కేంద్రానికి రానున్నారు. ఉదయం 10.30 గంటలకు నిర్మల్‌కు చేరుకుంటారు. జిల్లా కేంద్రంలో రూ.5.40 కోట్లతో నిర్మితమైన బాలుర, బాలికల జూనియర్ కళాశాల భవనాలను ప్రారంభించనున్నారు. ఇక్కడ విద్యార్థుల నుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు జన్నారం బయలు దేరి, 12.30 గంటలకు అక్కడ నిర్మించిన జూనియర్ కాలేజీ భవనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం భోజన విరామం తర్వాత కాసీపేట్ బయలు దేరుతారు 3.30 గంటలకు మండల కేంద్రంలో బాలుర జూనియర్ కళాశాల భవనం ప్రారంభిస్తారు. అక్కడి నుంచి నేరుగా మంచిర్యాల్, కరీంనగర్‌ల మీదుగా బయలుదేరి హన్మకొండలో రాత్రి బసచేస్తారు. జిల్లాలో జరిగే జూనియర్ కళాశాల భవన ప్రారంభోత్సవాల్లో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మంత్రి జోగు రామన్న పాల్గొననున్నారు.

రైతు కమిటీలల్లో అన్ని కులాలకు ప్రాధాన్యత: మంత్రి

● రైతు కమిటీలపై అవగాహన సదస్సు ● సెప్టెంబర్ నాలుగులోగా గ్రామ రైతుల కమిటీల ఏర్పాటును పూర్తి చేయండి: అల్లోల


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి

నిర్మల్‌కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేయబోయే రైతు కమిటీలను షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని మంత్రి రైతులకు సూచించారు. సోమవారం నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి రైతు కమిటీలపై అవగాహన కల్పించారు. గ్రామ రైతు సంఘాలు సెప్టెంబర్ నాలుగులోగా పూర్తి చేయాలన్నారు. 15 మంది రైతులతో కమిటీని ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో రైతులు స్థిరనివాసం ఉండాలన్నారు. ఏవరి పేరు మీద భూమి పట్టాపాస్‌బుక్ ఉంటుందో వారే గ్రామ రైతు కమిటీ ఎంపికకు అర్హులన్నారు. ప్రతి గ్రామంలో మహిళా రైతులకు 33 శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. ఒక కో ఆర్డినేటర్‌ను నియమించుకోవాలని అన్నారు. మండల స్థాయి రైతు కమిటీలను సెప్టెంబరు 6 నుంచి ఏర్పాటు చేయాలన్నారు. మండల కమిటీలో 24 మంది సభ్యులుంటారని తెలిపారు. మండల స్థాయిలో ఒక కో ఆర్డినేటర్‌ను నియమించుకోవాలన్నారు. ఆ తరువాత జిల్లా రైతు కమిటీలను ఏర్పాటు చేస్తామని, జిల్లా కమిటీలో కూడా 24 సభ్యులతో పాటు ఒక కో ఆర్డినేటర్‌ను నియమించుకోవాల్సి ఉటుందని పేర్కొన్నారు. గ్రామ, మండల, జిల్లా కమిటీల ఎంపిక పూర్తైన తరువాత రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 33 శాతం రిజర్వేషన్ వర్తింపజేస్తారన్నారు. కమిటీలలో అన్ని కులాల వారికి ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. గ్రామ కమిటీలలో అర్హులైన వారి జాబితాను ఈ నెల 30లోగా ప్రకటించిన తరువాత గ్రామ కమిటీలను ఎంపిక చేయాలన్నారు. గ్రామ, మండల, జిల్లా కమిటీలు ఏర్పాటైన తరువాత రాష్ట్రస్థాయి అధికారులు రైతు కమిటీల విధి విధానాలపై శిక్షణ నిస్తారని తెలిపారు. జిల్లాలోని కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులు నిబంధనలను పాటించి రైతు కమిటీల ఏర్పాటును పారదర్శకంగా ఉండేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, ఏఎంసీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, రాజ్ మహ్మద్‌తో పాటు రాష్ట్ర టీఆర్‌ఎస్ కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గంగారం, సోన్ మండల పార్టీ అధ్యక్షులు మోహినొద్దిన్‌తో పాటు ఆయా గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పిఎసిఎస్ చైర్మన్‌లు, రైతులు పాల్గొన్నారు

'గణేష్ మండపాల వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి'


చైర్మన్‌కు వినతి పత్రం అందిస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

నిర్మల్‌టౌన్: గణేష్ నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని ఆయా మండపాల వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తికి గణేష్ ఉత్సవ సమితి సభ్యులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పతికే రాజేందర్ మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద వీధి దీపాలు, గుంతల రోడ్లకు మరమత్తులు చేయించాలని, నిమజ్జన శోభయాత్రలో ఎలాంటీ అపశ్రుతులు చోటు చేసుకోకుండా ఏర్పాట్లను చేయాలని అన్నారు. అనంతరం చైర్మన్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు ఎడపెల్లి నరేందర్, కపిల్, గంగ్రత్ రమేష్, ఎంబడి చంద్రశేఖర్, నిగులపు సంజీవ్, మురళీ, సాయి, తదితరులున్నారు.

పోలీసులు ప్రజా విశ్వాసాన్ని పొందాలి: ఎస్పీ

నిర్మల్‌టౌన్: పోలీసుల ప్రజా విశ్వాసాన్ని పొందాలని ఎస్పీ విష్ణు ఎస్ వారియర్ పిలుపునిచ్చారు. ప్రజాఫిర్యాదు విభాగానికి హాజరయ్యారు. పలు అర్జీలను స్వీకరించి పరిష్కరించారు. గణేష్ నవరాత్రుల్లో ఎలాంటీ ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసామన్నారు.

వినాయక నిమజ్జన స్థలాలను పరిశీలించిన డిఎస్పీ

నిర్మల్‌కల్చరల్: సోమవారం బంగల్‌పేట్ చెరువు వద్ద గల వినాయక నిమజ్జన స్థలాన్ని నిర్మల్ డిఎస్పీ మనోహర్ రెడ్డి సందర్శించారు. నిమజ్జన సందర్భంగా ఎలాంటీ సంఘటనలు తీసుకోవాలని ఆయన సీఐలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గణేష్ నిమజ్జనంలో ఎలాంటీ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆయన పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట సీఐలు జాన్ దివాకర్, జీవన్ రెడ్డిలున్నారు.


సమావేశంలో మాట్లాడుతన్న డిఎస్పీ

సినిమా గైడ్ నిర్మల్



తిరుమల: నేనే రాజు నేనే మంత్రి

వేంకటేశ్: జయ జానకి నాయకా

నారాయణ: ఫిదా

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్

నిర్మల్‌టౌన్: ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఇలంబరిది అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదుల విభాగంలో పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలన్నారు. భూ సంబంధిత కేసులు, లే అవుట్లు, డబుల్ బెడ్‌రూం మంజూరు, వృద్దాప్య, వితంతు, ఒంటరి మహిళా పింఛన్‌లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు సంబంధించిన సబ్సిడీ రుణాల లబ్ధికోసం అర్జీలు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శివలింగయ్య, డీఆర్‌వో నగేష్, ఆర్డీవో ప్రశునాంభ, డీఎవో గంగారాం, డీఆర్డీవో వెంకటేశ్వర్లు, డీఈవో ప్రణీత, డిటిడిఎ జనార్ధన్, తహసీల్దార్ శంకర్, డిటి కిరణ్మయి, వెంకట రమణ, రిజిస్ట్రార్ సాయినాథ్, ఎపిఓ శోభారాణి, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలంబరిది

అధికారులు స్ఫూర్తిదాయకంగా ఉండాలి

● జిల్లా వ్యవసాయాధికారికి సన్మానం

నిర్మల్ టౌన్: ప్రజలతో మమేకమై వారికి మంచి సేవలందిచే అధికారులు ఎప్పటికీ గుర్తిండి పోతారని కలెక్టర్ ఇలంబరిది అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశం మందిరంలో జిల్లా వ్యవసాయాధికారి గంగారాంను ఈ నెల 31న పదవి విరమణ చేస్తున్న సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కలెక్టర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం చేసే అధికారులు స్ఫూరిధాయకంగా ఉండాలన్నారు. వ్యవసాయాధికారి గంగారాం గ్రామీణ ప్రాంతలోని రైతులకు సేవలందిచడం ప్రశంసనియం అన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శివలింగయ్య, డీఆర్వో నగేష్, డీఆర్డీవో వెంకటేశ్వర్లు, ఆర్డీవో ప్రసునాంబ ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక


మాట్లాడుతున్న మంత్రి అల్లోల

నిర్మల్‌టౌన్: మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో సోమవారం పలువురు టీఆర్‌ఎస్‌లో చేరారు. సోన్ గ్రామానికి చెందిన హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ నవకాంత్ టీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి అల్లోల మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలు అమలు చేయడంతో పాటు వ్యవసాయ రంగానికి పెద్దపీఠ వేయడంతో ఇటీవల సీఎం కేసీఆర్‌కు అవార్డు కూడా దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వి. సత్యనారాయణ గౌడ్, సోన్ మండల పార్టీ అధ్యక్షులు మోహినొద్దిన్, టిఆర్‌ఎస్ పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు పాకాల రాంచంధర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నాబాహు సాఠే జయంతి

దిలావర్‌పూర్: మండలంలోని కదిలి గ్రామంలో మహాత్మా అన్నాబాహు సాఠే జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. అన్నాభావు చిత్రపటానికి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వసుంధర భుజంగ్‌రావు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు దత్తూరాం, సాయినాథ్, నాగభూషన్, రాములు, రాము, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ (జి): సోమవారంగొల్లమాడ గ్రామంలో అన్నాబాహు సాటే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ పాపెన్ రాజేశ్వర్ పతాకావిష్కరణ చేసి ప్రసంగించారు. సమాజానికి అన్నాబాహు అందించిన సేవలను కొనియాడారు. ప్రతీ సంవత్సరం ఆయన జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కారారం భూమన్న, ఉపాధ్యక్షులు కాసారం శ్రీనివాస్, కోశాధికారి చింతకుంట శ్రీనివాస్, సహ కోశాధికారి శంకర్, ప్రధాన కార్యదర్శి లస్మన్నతో పాటు పలువురు పాల్గొన్నారు.

33వ జాతీయ స్థాయి కరాటేలో నిర్మల్ విద్యార్థుల ప్రతిభ

నిర్మల్ స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని అంబర్‌పేట్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 33వ జాతీయ స్థాయి శోటోకాన్ కరాటే పోటీల్లో నిర్మల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆదివారం నిర్వహించిన కాట విభాగండలో జశ్విత, శ్రీవాత్సవ, శ్రీవర్ష, పియూష్, చౌరశీయ గోల్డ్ మెడల్, హృషికేష్ సిల్వర్ మెడల్ సాధించారు. కుమిటే స్ప్రింగ్ విభాంగలో ప్రనవి, జస్విత, చౌరాసియాలకు బంగారు పతకాలు రాగా, సంతోషిని సిల్వర్ మెడల్ సాధించింది. అనంతరం వీరిని అబినందించారు టీఎస్ ప్రసిడెంట్ చుక్క ధర్మరాజు, టీఎస్ సెక్రటరీ తెజేంధర్ సింగ్ బాటియా, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, సీనియర్ శిక్షకులు భూషన్, చిరంజీవి, అభిలాష్ తదితరులుపాల్గొన్నారు.


అవార్డు పత్రాలతో విద్యార్థులు

వీఆర్‌వో సర్వే ట్రైనింగ్ ప్రతిపాదనలు పంపడంపై హర్షం

కడెం: నిర్మల్ జిల్లాలోని 14 మంది వీఆర్‌వోలకు సంబంధించిన సర్వే ట్రైనింగ్ అకాడమీకి ప్రతిపాదనలను పంపడంపై టీఎన్‌జీవో జిల్లా కమిటీ సభ్యులు మెస్రం బాపురావు, వీఆర్‌వోల సంక్షేమ కమిటీ సభ్యులు మోహన్, నర్సయ్య, గంగాధర్ హర్షం వ్యక్తం చేశారు. 2016 నుంచి సర్వే అకాడమీకి వీఆర్‌వోలను పంపలేదన్నారు. జేసీ శివ లింగయ్య, డీఆర్‌వో నగేష్ చొరవ చూపి ప్రతిపాదనలను పంపించడంనందుకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

● ఎస్‌బీఐ శిక్షణ అధికారి మల్లయ్య



శిక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్న శిక్షణ అధికారి మల్లయ్య

దస్తూరాబాద్: నిరుద్యోగ యువతి, యువకులు స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ శిక్షణాధికారి మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఉట్నూర్ వారి ఆధ్వర్యంలో సోమవారం నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణపై అవగాహన కల్పించారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కొమురంభీమ్ కాంప్లెక్స్‌లో నెల రోజుల పాటు ఉచితంగా ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, ద్విచక్రవాహనాల సర్వీసింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, ఏసీ రిఫ్రిజరేషన్, మహిళలకు బ్యూటీషియన్, కుట్టు మిషన్, బ్యాగ్‌ల తయారీ తదితర వాటిపై శిక్షణ ఇస్తామన్నారు. భోజన, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాలలోపు ఉన్నవారు, 10వ తరగతి పాస్/ఫెయిల్ మెమో, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, జిరాక్స్ కాపీలు, 4 పాస్ పోర్ట్ సైజు ఫొటోలతో సెప్టెంబర్ 8లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 9949412159, 8096093085 చరవాని నంబర్‌ను సంప్రదించాలన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక


దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

మామడ: మండలంలోని న్యాసాంగ్వి, దిమ్మదుర్తి గ్రామాలలో డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల పేర్లను న్యాసాంగ్విలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈవోపీఆర్డీ చదివి వినిపించారు. నల్దుర్తి గ్రామంలో నూతనంగా 25 దరఖాస్తులను స్వీకరించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కమలాకర్, పంచాయతీ సెక్రటరీ అశోక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాలింతలకు కేసీఆర్ కిట్ అందజేత

దస్తూరాబాద్: మండల కేంద్రంలోని దస్తూరాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం భవానికి డాక్టర్ హరిక కేసీఆర్ కిట్‌ని అందజేశారు. కేసీఆర్ కిట్ నిరుపేద బాలింతలకు ఉపయోగకరంగా ఉటుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో సదయ్య, స్టాఫ్‌నర్స్ ఇందిరా, ఎల్‌టీ రాజేందర్, రవీందర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెంబి: మండల కేంద్రానికి చెందిన సుమలతకు స్థానిక పీహెచ్‌సీలో మగబిడ్డకు జన్మనిచ్చింది. సోమవారం బాలింత సుమలతకు పెంబి పీహెచ్‌సీ సిబ్బంది కేసీఆర్‌కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రాధ తదితరులున్నారు.

ఖానాపూర్‌లో ఘనంగా కుంకుమార్చన

ఖానాపూర్: మండల కేంద్రంలోని తిమ్మాపూర్ మున్నూరు కాపు సంఘం గణేష్ మండలి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా కుంకుమార్చన నిర్వహించారు. కుంకుమార్చనలో పాల్గొన్న భక్తుల్లో ముగ్గురిని లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసి చీరలను అందజేశారు. అనంతరం మున్నూరు కాపు సంఘ భవనంలో అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎంపీపీ ఆకుల శోభరాణి, మాజీ సర్పంచులు బక్కశెట్టి లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, మున్నూరు కాపు సంఘం మండలాధ్యక్షుడు బీసీ రాజన్న, తిమ్మాపూర్ సంఘం అధ్యక్షుడు సిరిపురం నాగరాజు, యువజన సంఘం అధ్యక్షుడు కొక్కుల ప్రదీప్, మున్నూరు కాపు సంఘం నాయకులు గుండ్ల రాములు, మంగ్లారపు రాజేశ్వర్, తదితరులున్నారు.

చిందులేసిన 'జానపదం'

● కళాకారులకు మంత్రి ప్రశంసలు


యక్షగాన కళాకారుడు లచ్చిరాం

నిర్మల్‌కల్చరల్: ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా సోమవారం నిర్మల్‌లోని వైఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ జానపద కళాజాత ఆధ్వర్యంలో జిల్లాలోని కళాకారులు వివిధ రంగాల్లో వారి ప్రతిభను కనబరిచారు. చిందు యక్షగానం పలువురిని విశేషంగా అలరించింది. కళాకారుల కోలాటం, జడకొప్పుల ప్రదర్శన, బుర్రకథ గానం అలరించాయి. గంగిరెద్దులతో జీవితాన్ని గడిపే కళాకారులు, సతీ సావిత్రి యక్షగాన బృందం ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి మంత్రి అల్లోల హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కళాకారులు ప్రదర్శించే జానపద కళలకు ప్రభుత్వం తగిన గుర్తింపు నిస్తుందన్నారు. భవిష్యత్‌లో యక్షగానాన్ని ఆయా మండలాల్లో కళాకారులు కళా ప్రదర్శనను చేసేందుకు లక్ష రూపాయల ప్రోత్సాహాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జానపద కళా అధ్యక్షుడు బంగారు శ్రీనివాస్ గౌడ్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, ఏఎంసీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్‌తో పాటు పలువురు కౌన్సిలర్‌లు తోట లత నర్సయ్య, టీఆర్ఎస్ నాయకులు పొకాల రాంచందర్, జిల్లా జానపద కళా సంస్థ కార్యవర్గ సభ్యులు ఎట్టెం రజిత, కళాకారులు రఘు, నాగరాజు, రాజు, మిమిక్రీ ఆర్టిస్టు సుధాకర్ తదితరులున్నారు.


కోలాటం ప్రదర్శిస్తున్న మస్కాపూర్ కళాకారులు

జానపద కళలకు చేయూతనివ్వాలి

- యక్షగాన కళాకారుడు లచ్చిరాం. ధని గ్రామం

ప్రభుత్వం యక్షగాన కళాకారులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని కళలను ఆదరించాలి. కళలను జీవనాధారం చేసుకొని గడుపుతున్న తమకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి డబుల్ బెడ్‌రూంలను మంజూరు చేయాలి. కళల కోసం జీవితాన్ని అంకితం చేస్తున్నాం. సామాజిక అంశాలపై ప్రజలను చైతన్య పరుస్తూ పౌరాణిక ఇతివృత్తాలతో ప్రదర్శనలను ఇస్తున్నాం. రావణ బ్రహ్మ, సీతారామ కల్యాణం తదితర చిందు యక్ష గానాలు ఊరూరా ప్రచారం చేస్తాము.

'గంజాల్'లో డబుల్ నిర్మాణానికి ట్రబుల్

నిర్మల్ కల్చరల్: ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని వేగవంతం చేస్తోంది. నిర్మల్ జిల్లా సమీపంలోని గంజాల్ గ్రామానికి మంజూరైన డబుల్ బెడ్ రూం ఇళ్లకు ఓ వ్యాపారి అడ్డుతగులుతున్నాడని ఆ గ్రామ మహిళలు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదుల విభాగంలో కలెక్టర్‌కు వారి సమస్యను విన్నవించారు. గంజాల్ గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు 44 మందికి మంజూరైయ్యాయని వారు పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూంలను నిర్మించతలపెట్టిన స్థలాని పక్కన ఓ రైస్ మిల్ యజమాని ఆక్రమించాలని చూస్తున్నాడని, అందుకే స్థలాన్ని చదును చేసినా నిర్మాణాలను అడ్డుకుంటున్నాడని వారు కలెక్టర్‌కు విన్నవించారు. తామంతా వ్యవసాయకూలీలు, బీడీ కార్మికులుగా జీవనం కొనసాగిస్తున్నామని విన్నవించారు. ఎలాంటి నిలువ నీడలేని తమకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూం లను నిర్మించి ఇవ్వాలని పేర్కొన్నారు.

కుంటాల మండలం వెంకూరు గ్రామానికి చెందిన బుచ్చమ్మ(70) తనపేర భూమిని పటా చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసింది. సర్వేనెం. 230/19లో 6.29 ఎకరాల భూమిని ఆనాదిగా సాగుచేసుకుంటున్నామని వినతి పత్రంలో పేర్కొంది. భూమి పట్టా రిజిస్ట్రేషన్ చేసి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరింది.


కలెక్టర్‌కు విన్నవించడానికి వచ్చిన గంజాల్ మహిళలు

అవాంతరాలను తొలగించాలి

- రాజవ్వ గంజాల్



డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల్లోని అవాంతరాలను తొలగించాలి. రైసుమిల్లు పక్కనే స్థలం కేటాయించినందుకే సదరు వ్యాపారి నిర్మాణాలకు అడ్డుతగులుతున్నాడు. వేరేచోట స్థలం కేటాయించి నిర్మాణాలను చేపట్టాలి.

ఖానాపూర్ కవులకు సన్మానం



వేణుగోపాల్, డీఎల్ఎన్ చారిలను సన్మానిస్తున్న దృశ్యం

ఖానాపూర్‌రూరల్: ఖానాపూర్‌కు చెందిన ఇద్దరు కవులకు కరీంనగర్ జిల్లా కేంద్రంలో సన్మానించారు. తెలుగు పండిత్ ప్రభుత్వ ఉపాధ్యాయులు వొడ్నాల వేణుగోపాల్, డీఎల్ఎన్ చారిలను తెలంగాణ ప్రభుత్వ విప్ కొప్పుల ఈశ్వర్ మాజీ ఎమ్మెల్సీ నారద లక్ష్మణ్, కరీంనగర్ జాగృతి నిర్వాహకులు సన్మానించారు. తెలంగాణభాష, యాస, సంస్కృతిపై నిర్వహించిన జాగృతి అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర వ్యాప్త కవుల సమ్మేళనంలో భాగంగా ఆదివారం సాయంత్రం సన్మానం చేసారు. వేణుగోపాల్ రాసిన 31 జిల్లాల తెలంగాణ పాట, డీఎల్ఎన్ చారి రాసిన వీర తెలంగాణ పాటకు అవార్డులు అందజేసారు. ఈ సందర్భంగా స్థానిక ఉపాధ్యాయులు, కవులు, ఉద్యోగులు వారిని అభినందించారు.

టీ మాస్‌ఫోరం రౌండ్‌టేబుల్ సమావేశం

కడెం: తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్యవేదిక టీ మాస్ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని కడెంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీ మాస్ ఫోరం జిల్లా సభ్యుడు జీ. కిషన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు ప్రజల సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే నెల 3న నిర్మల్‌లో నిర్వహించే టీ మాస్ ఆవిర్భవ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దుర్గం నూతన్, కార్మదర్శి డాకురి తిరుపతి, డీవైఎఫ్ నాయకులు సురేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్‌కే దాదేమియా, వివిధ ప్రజా, కుల సంఘాల నాయకులు, అర్ల రమేష్, గంగన్న, లక్ష్మణ్, కేయూపీఎస్ నాయకులు రాజలింగం, దుర్గం పోశలింగం తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి'

నిర్మల్‌టౌన్: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. తెలంగాణ రాష్ట్రంలో 1.20లక్షల మంది ఉపాధ్యాయ, ఉద్యోగులు సీపీఎస్ విధానంతో విధులు నిర్వహిస్తున్నారని, పదవి విరమణ అనంతరం వారికి భరోసా లేకుండా పోతుందన్నారు. ధర్నాలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా తమ గోడను గుర్తించి సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని వారు విన్నవించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జేసీ శివలింగయ్యకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు రామారావు, నారాయణ, కృష్ణ, భూమేష్, ధర్మారావు, సుదర్శన్ తదితరులున్నారు.



కలెక్టరేట్‌లో వినతి పత్రం అందిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

వడ్తాల్‌లో ఘనంగా బలరాం జయంతి

ముథోల్: మండలంలోని వడ్తాల్ గ్రామంలో సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో బలరాం జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి విట్టల్ రెడ్డి, సాయన్న, గంగన్న, సంతోష్‌కుమార్, ఆనంద్, గంగాప్రసాద్, మాధవ్‌రావ్, తదితరులు ఉన్నారు.



సీపీస్ ఉద్యోగులకు మద్దతుగా ఉద్యమిస్తాం : పీఆర్టీయూ

భైంసా: సీపీఎస్ పింఛన్ రద్దును డిమాండ్ చేస్తూ ఆ సంఘం ఉద్యోగులు చేపడుతున్న ఆందోళలకు మద్దతుగా పూర్తి స్థాయిలో ఉద్యమిస్తామని పీఆర్‌టీయూ భైంసా మండల అధ్యక్ష, కార్యదర్శులు బల్స గజ్జారాం, ఏ. గోపాల్‌లు వెల్లడించారు. సోమవారం సంబంధిత విషయామై స్థానిక ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సీపీఎస్ ఉద్యోగులందరికి వచ్చే నెల 1న సామూహిక సెలవును ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పాత పింఛన్ విధానాలను అమలు పరిచేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. లేని పక్షంలో సీపీఎస్ ఉద్యోగులకు మద్దతుగా ఆందోళలనను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు. ఇందులో యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు పుండలిక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

'ఎంఆర్ టీకాలు ప్రతీ విద్యార్థికి తప్పనిసరి'

కుంటాల: ప్రతీ ఒక్కరు టీకాలను వేసుకోవాలని ప్రతి విద్యార్థి తప్పనిసరిగా మీజిల్స్, రుబెల్లా టీకాలను వేసుకోవాలని ఓల సర్పంచ్ ఎగ్గాం గజ్జారాం అన్నారు. సోమవారం మండలంలోని ఓల, సూర్యాపూర్, అంబుగాం, దౌనెల్లి గ్రామాలలో పాఠశాల విద్యార్థులకు హెల్త్ సూపర్‌వైజర్ చిన్నన్న ఆధ్వర్యంలో మిజీల్స్, రుబెల్లా టీకాలను వేశారు. అన్ని పాఠశాలలోనూ విద్యార్థులకు ఈ టీకాలను వేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎగ్గాం గజ్జారాం, చిన్నరాజలింగులు విద్యార్థులకు రుబెల్లా టీకా సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఆయాలు, పీహెచ్‌సీ సిబ్బంది. ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

'ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి'

కుంటాల: ప్రతీ విద్యార్థి విజయం సాధించాలంటే తనపై తనకు నమ్మకాన్ని ఏర్పర్చుకోవాలని తెలంగాణ అకాడమి స్కిల్స్ నాలెడ్జ్ శిక్షకుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని కల్లూర్ వాసవి కళాశాలలో డిగ్రీ ఫైనల్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మానసికంగా భయాందోళలను తొలగించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ప్రతి విద్యార్థి దృఢ సంకల్పాన్ని కలిగి ఉండాలని అన్నారు. ఏకాగ్రతతో నడుచుకోని ప్రతికూల ఆలోచనలు రాకుండా చూసుకోని ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగా సాధనవైపు దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాయిలు, తదితరుల ఉన్నారు.

విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- ఏఎస్‌డబ్ల్యూవో ఎంఏ అలీమ్

కుభీర్: విద్యార్థులు చదువులో రాణించి వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఏఎస్‌డబ్ల్యూవో ఎంఏ అలీమ్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని హరిజన సంక్షేమ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టికలను, పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనాలను అందిస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఆయన వెంట వార్డెన్ భాస్కర్, తదితరులు ఉన్నారు.


విజేతలకు బహుమతుల ప్రదానం

కుభీర్: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని శివసాయి గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధాన చేశారు. ఈ కబడ్డీ పోటీల్లో పది జట్లు తలపడగా బాహుబలి జట్టు మొదటి విజేతగా నిలిచింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగంపల్లి శివలింగం, నాయకులు అమరేష్, దేవేందర్, సాయినాథ్, పోశెట్టి తదితరులన్నారు.

దూరమవుతున్న వీధి దీపాల వెలుగులు!

- ప్రత్యేకదృష్టి పెట్టని పంచాయతీలు

భైంసా: స్తంభం ఉంటే లైటు ఉండదు. లైటుంటే అది వెలుగివ్వదు. వెలిగే లైటుంటే అది ప్రజలకు ఉపయోగకరంగా ఉండదు. ఇదీ పంచాయతీల్లో వీధి దీపాల నిర్వహణ తీరు. ముథోల్ నియోజక వర్గ పరిధిలో గల ఏడు మండలాల్లోని 110 గ్రామపంచాయతీలలో ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ప్రజల కనీస అవసరాల్లో ఒకటైన వీధి దీపాల నిర్వహణను సరిగ్గా పట్టించుకోవడం లేదని గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీధి దీపం వెలుగులు ఆగితే మళ్లీ ఎప్పటికి వస్తాయోనని ఎదురు చూడాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. పలు మండలాల్లోని వివిధ గ్రామాల్లో మరమ్మత్తుకు గురైన వీధి దీపాలను తీసుకెళ్లిన సిబ్బంది నెలలు గడుస్తున్నా ఆ దీపాలను తీసుకు రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. గార్డ్‌లు ఉండి వీధి దీపాలు లేని స్తంభాలు అన్ని మండలాల్లో ఉన్నాయంటే వీధి దీపాల నిర్వహణ ఎంత అధ్వానంగా ఉందో ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. వెలగని వీధి దీపాలు అధిక శాతం గ్రామాల్లో ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో వీధి దీపాలు వెలుగుతున్నా, ఆ వెలుగులు ప్రజలకు ఉపయోగకరంగా లేవు. రోడ్డుపైకి కాకుండా చేలు, ముళ్ల పొదల్లోకి వెలుగులు వెళుతున్నాయి.



జర దేఖో!!

ట్యూబులైటు లేకుండా విద్యుత్ స్తంభం ఇలా..

వీధి దీపాల నిర్వాహణ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండటం గ్రామీణ వాసులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు అవలంభిస్తున్న అలసత్వ విధానాలను అసరగా తీసుకుంటున్న గ్రామ పంచాయతీల సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండటం మూలంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం ఏ గ్రామంలో చూసిన వీధి దీపాల సమస్య నెలకొని ఉంది. ఉన్నతాధికారులు ఇకనైనా ఈ విషయమై స్పందించాలని, సత్వరమే సమస్యను పరిష్కరించి తమ ఇబ్బందులను తొలగించాలని గ్రామీణ ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

తెరిచిఉన్న బోరుబావి!

భైంసా రూరల్: మండలంలోని ఎగ్గాం సమీపంలోని వరి పొలంలో ఇటీవల బోరును వేశారు. నీళ్లు పడక పోవడంతో దాన్ని నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షానికి బోరు రంధ్రం కాస్త రెండు అడుగుల వెడల్పు అయింది. పంటపొలాలలో పనిచేసేందుకు వెళ్లిన వారికి దీంతో పెను ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయమై సంబంధిత అధికారులు, ప్రభుత్వం ఎన్ని సార్లు హెచ్చరించినా ప్రజలలో మార్పు రావడం లేదు. ఒకవేళ ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యులని పలువురు అనుకుంటున్నారు. రహదారి పక్కనే ఉన్న ఈ బోరు బావిని పూడ్చి వేతపై నిర్లక్ష్యం పట్ల పలువురు చర్చించుకుంటున్నారు.



ఎగ్గాం సమీపంలో రహదారి పక్కనే తెరిచి ఉన్న బోరు బావి

'ఫిర్యాదుల విభాగాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

కుభీర్: మండలపరిషత్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ఫిర్యాదుల విభాగాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన పిర్యాదుల విభాగానికి కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని మాదిగ జేఏసీ నాయకులు, ఆహారభద్రత కార్డు నిర్మల్ మండలం కడ్తాల్ గ్రామం నుంచి కుభీర్ మండలానికి బదిలీ చేయాలని లలిత, ఎస్‌కేఎస్ డాటా వివరాలను అందించాలని గీత, పల్సి గ్రామపంచాయతీకి మంజూరైన నిధుల వివరాలను అందించాలని సమాచార హక్కు చట్టంలో దరఖాస్తు చేసుకున్న గత 8నెలల నుంచి వివరాలు అందించడం లేదని సంబంధిత అధికారులపై చర్యలు తీసకోవాలని పల్సి గ్రామానికి చెందిన రాజేష్ దరఖాస్తులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏపీవో నవీన్, ఏపీఎం సృజన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి హాజరయ్యారు.



కుభీర్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి

లోకేశ్వరం: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ఫిర్యాదుల విభాగానికి నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు లోకేశ్వరం తహసీల్దార్ లోకేశ్వర్‌రావ్ తెలిపారు. ఫిర్యాదుల విభాగాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. అలాగే ఫిర్యాదుల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ధర్మోరా గ్రామ సర్పంచ్ కందం శ్రీనివాస్‌రావు, హద్గాం సర్పంచ్ కదం చంద్రాబాయి తమకు న్యాయం చేయాలంటూ అర్లి, గొడిసెర నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కుటుంబ సభ్యులతో కలిసి పాదయాత్రతో వచ్చి వినతిపత్రాన్ని తహసీల్దార్ లోకేశ్వర్‌రావుకు అందజేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో భూమి కోల్పోయిన అర్లి, గొడిసెర గ్రామ రైతులకు పాత గొడిసెర గ్రామంలో భూములు ఇచ్చారని ఆ భూముల విషయమై న్యాయంచేయాలని తహసీల్దార్ లోకేశ్వర్‌రావ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సూపరిండెంట్ సాయన్న, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరీ, ఏఈవో మౌనిక, తదితరులు ఉన్నారు.

ఇంటర్వ్యూ

గణేష్ ఉత్సవాలకు అంతటా పటిష్ట బందోబస్తు



టీ.మహేష, బాసర ఎస్సై

ఆంధ్రజ్యోతి: గణేష్ ఉత్సవాలకు బదోబస్తు చర్యలు చేపడుతున్నారా?

ఎస్సై: ఉత్సవాల కంటే ముందు నుంచే పీస్ కమిటీలతో సమావేశం ఏర్పాటు చేశాం. ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించాం. గణేష్ మండపాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: శోభయాత్రలో డీజేలను వినియోగించుకోవచ్చున్నా?

ఎస్సై: శోభయాత్రలో డీజేలను వినియోగించుట నిషేధం. హైకోర్టు ఆదేశాల మేరకు వినియోగిస్తే కఠినచర్యలు తప్పవు.

ఆంధ్రజ్యోతి: నిమజ్జనం రోజు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారా?

ఎస్సై: ప్రతీ గ్రామంలో నిమజ్జనం రోజు ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నాం. ఎవరైనా శాంతి వాతవరణానికి విఘాతం కలిగిస్తే ఎంతవారైన పోలీస్ చర్యలకు లోనుకాక తప్పదు. అదేవిధంగా ప్రతీయేట వివిధ ప్రాంతాల నుంచి గోదావరికి విగ్రహాలను తీసుకువస్తారు. కావున అక్కడ కూడా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నాం. - బాసర

కొరడి గణపతికి విశేష ఆదరణ

- తండోపతండాలుగా తరలి వస్తున్న భక్తులు

భైంసా రూరల్: మండలంలోని మాటేగాంలో వెలసిన కొరడి గణపతికి విశేష ఆదరణ లభిస్తోంది. వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో స్వయంభూగా వెలసిన కొరడి గణపతిని ప్రతిష్ఠించారు. ఈ గణపతిని దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివెళ్తున్నారు. గత మూడు రోజులుగా భక్తులు వేల సంఖ్యలో దర్శించుకుంటున్నారు. కొరడి గణపతిని ప్రతిష్ఠించిన చోట ఉన్న వటవృక్షానికి గణపతి పేరిట ముడుపులు కడుతున్నారు. గణపతిని దర్శించుకొని కోరిన కోరికలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. గణపతిని దర్శించుకున్న వారు మొక్కులు చెల్లించుకుని ముడుపులు కడుతున్నారు. కోరికలు సిద్ధిస్తే మొక్కులు చెల్లించుకుంటామని భక్తులు ముడుపులు కట్టి వెళ్తున్నారు. భక్తుల సౌకర్యార్థం గ్రామస్తులు అన్నదానం, తాగునీటి వసతి, పార్కింగ్, భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. కొంత మంది భక్తులు పాదయాత్రగా తరలి వస్తున్నారు. భైంసా చుట్టుప్రక్కల ప్రాంతంతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి రావడం విశేషం.



బారులు తీరిన భక్తులు

స్వయంభూ వెలసిన దైవం : మధు వీడీసీ చైర్మన్, మాటేగాం



గత మూడు మాసల క్రితం గ్రామంలో ఒక రైతు ఇంట వెలసిన గణపతి వెలసింది. చెట్టు కొరడి కావడంతో కొరడి గణపతి అని పేరు పెట్టాం. ఈ కొరడి గణపతి వెలసినప్పటి నుంచి పూజలు నిర్వహిస్తున్నాం. దీంతో గ్రామంలో సుఖ శాంతులు నెలకొన్నాయి. కోరుకున్న కోరికలు తీర్చడంతో కొరడి గణపతి కోసం మందిరం నిర్వహించాలని నిర్ణయించాం.

ఎన్నడూ లేని ఆదరణ : సంతోష్ గౌడ్, మాటేగాం



గ్రామంలో కొరడి గణపతి వెలసిన నాటి నుంచి గ్రామానికి విశేష ఆదరణ లభిస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారు. ఊహించని రీతిలో గ్రామస్థులందరూ స్వతహాగా సహాయ చర్యలు చేపడుతున్నారు. భక్తుల కోసం రోజుకు 5నుంచి 7క్వింటాళ్ల వరకు పులిహోరను ప్రసాదంగా అందిస్తున్నాం.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 2, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): సమావేశాలు, వేడుకల్లో ఆశాభంగం కలుగుతుంది. వృత్తి, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఉన్నత విద్య కోసం చేసే ప్రయత్నాలు ఫలించకపోవచ్చు.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): ప్రియతముల ఆరోగ్యం కలవరపెడుతుంది. ఖర్చులు అంచనాలు మించుతాయి. పెట్టుబడులు, పొదుపు పథకాల విషయంలో ఆచితూచి వ్యవహరించాలి. ఆర్థిక లావాదేవీల్లో గత అనుభవం ఉపయోగపడుతుంది.

మిథునరాశి: (మే21-జూన్21): శ్రీవారు, శ్రీమతి వైఖరి ఆవేదన కలిగిస్తుంది. వేడుకలకు ఏర్పాట్లలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. బంధుమిత్రుల కారణంగా మనస్తాపానికి గురవుతారు. అనుబంధాలు విస్తరిస్తాయి.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): ఇంటర్వ్యూలో నిరాశ ఎదురవుతుంది. వైద్యం, పరిశ్రమలు, హోటల్, రిటైల్ రంగాల వారికి ఒక సమాచారం కలవరం కలిగిస్తుంది. సన్నిహితుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. విందుల్లో ఖర్చులు అధికం.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): ప్రియతముల కోసం ఖర్చులు అంచనాలు మించుతాయి. పెట్టుబడుల్లో ఆచితూచి వ్యవహరించాలి. విద్యార్థులకు అవసరమైన నిధులు అందడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): బదిలీలు, మార్పులు అసౌకర్యం కలిగిస్తాయి. రియల్ ఎస్టేట్, గృహనిర్మాణ రంగా వారు కీలక నిర్ణయాలు వాయిదా వేయడం మంచిది. కుటుంబ సభ్యుల వైఖరి గురించి ఆలోచిస్తారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉంది. స్టేషనరీ, రవాణా, బోధన, రచనా రంగాల వారికి ఆటంకాలు ఎదురవుతాయి. వాగ్వివాదాలకు దూరంగా ఉండాలి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆర్థిక సంస్థలతో పనులు పూర్తి కావడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. ఖర్చులు అంచనాలు మించే అవకాశం ఉంది. బృందకార్యక్రమాలకు అవసరమైన నిధులు సర్దుబాటు కావడంలో ఆలస్యం జరుగుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): కొత్త ప్రాజెక్టుల ప్రారంభానికి తగిన సమయం కాదు. వృత్తి, వ్యాపారాల్లో ప్రయోగాలను వాయిదా వేయండి. పెద్దల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ఊహించని అవాంతరాలు ఎదురవుతాయి. ప్రయాణాలు, చర్చలు ఫలించకపోవచ్చు. దూరంలో ఉన్న వ్యక్తులకు సంబంధించిన సమాచారం కలవరపెడుతుంది.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): సమావేశాలు, వేడుకలు, బృందకార్యక్రమాల కోసం ఖర్చులు అధికం. ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలి. పూర్వ మిత్రులను గుర్తు చేసుకుంటారు. విలువైన వస్తువుల కొనుగోలు సమయంలో జాగ్రత్త అవసరం.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఉన్నత పదవుల విషయంలో నిరాశకు గురవుతాయి. పెద్దలు, పైఅధికారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. సమావేశాల్లో ఈ గౌరవ, మర్యాదలకు భంగం కలిగే పరిణామాలు చోటుచేసుకుంటాయి.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

ప్రజా సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలి

● మంచిర్యాల కలెక్టర్ ఆర్వీ కర్ణన్



సమస్యలు తెలియజేయడానికి వచ్చిన ప్రజలు, నిరసన తెలుపుతున్న ధర్మరావుపేట గ్రామస్థులు

మంచిర్యాల క్రైం : జిల్లాలోని ఆయా మండలాల నుంచి గ్రీవెన్స్‌కు వచ్చే దరఖాస్తులను పరిశీలించి ప్రజా సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని మంచిర్యాల కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణికి హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సంబంధిత శాఖలు తప్పనిసరిగా దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ కోఆర్డినేటర్ అత్తి సరోజతో కలిసి మహిళలకు సంబంధించిన టోల్‌ఫ్రీ నెంబర్ 181 గల గోడ ప్రతులను ఆవిష్కరించారు. బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాలకు చెందిన సుజాత 2015-17 మధ్య కాలంలో ఎంపీహెచ్‌ఏ కోర్సు పూర్తి చేశానని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో శిక్షణకు అనుమతించాలని వినతి పత్రం అందజేశారు. లక్షెట్టిపేట మండలం వెంకట్రావ్ పేట గ్రామానికి చెందిన అల్లం రజిత పుట్టుకతో అంగ వైకల్యం కలిగి ఉన్నందున పింఛన్ ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన మన్నెవారు కులస్థులు 14 కుటుంబాలు 12 సంవత్సరాలుగా భూమి సాగు చేసుకుంటున్నామని పట్టా ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. లక్షెట్టిపేట మండలం రంగంపేట గ్రామానికి చెందిన తోకల పోషం తన తండ్రి భూమి విరాసత్ కోసం ఏడు సంవత్సరాల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని, పట్టా ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌కు ఆర్జీ సమర్పించాడు. హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ శివారులోని సర్వే నంబర్ 303లో పత్తి పంటను ధ్వంసం చేశారని, సంబంధికులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గుడిపేట గ్రామానికి చెందిన నూతి వెంకటాచారి వినతి పత్రం అందజేశారు.

మంచిర్యాల జిల్లాలో బీసీ భవనం కోసం స్థలం కేటాయించాలని, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడాల సత్యనారాయణ, నాయకులు గుమ్ముల శ్రీనివాస్, గడ్డం సతీష్‌యాదవ్, బైర మల్లేష్, శశిధర్, శ్రీనివాస్, పున్నం, అంజి, గట్టయ్య, వాసు పాల్గొన్నారు.

● ఇన్‌చార్జి హెచ్‌ఎం సస్పెన్షన్ ఎత్తివేయాలి..

- ధర్మారావు పేట గ్రామస్థులు

కాసిపేట మండలం ధర్మారావుపేట జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎంగా విధులు నిర్వర్తించిన రాజయ్య సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని గ్రామస్థులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీహెచ్ శంకర్, కమలాకర్, లింగయ్య, తదితరులు ఉన్నారు.

● ఐకేపీ శ్రీనిధి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని..

జిల్లాలోని 18 మండలాల్లో పని చేస్తున్న తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మండలి సమాఖ్య శ్రీనిధి రిసోర్స్ పర్సన్స్‌లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సరంనర కాలంగా వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా ఉందని, ప్రతీ నెల ఇన్సెంటీవ్ వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో కళ్యాణి, సుజాత, వరలక్ష్మి ఉన్నారు.

● క్యాతన్‌పల్లి ఆర్‌వోబీ పనులు పూర్తి చేయాలని..

మందమర్రి మండలం క్యాతన్‌పల్లి రైల్వే బ్రిడ్జి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తి కాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదని పేర్కొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని బీజేపీ పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న బీజేపీ నాయకులు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం క్యాతన్‌పల్లి రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తు సోమవారం బీజేపీ అధ్వర్యంలో రామకృష్ణాపూర్ నుంచి మంచిర్యాల కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగానే ఫ్లైఓవర్ నిర్మాణంలో జాప్యం జరుగుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆరుముల్ల పోశం అన్నారు. బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనప్పటికీ అధికారులు పనులు మొదలు పెట్టకపోవడానికి స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ కారణమని మండిపడ్డారు. రైల్వే బ్రిడ్జి నిర్మాణం కోసం ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదని ధ్వజమెత్తారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అందుగుల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ సెంటిమెంట్‌తో గెలిచిన టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదన్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే ప్రజలకు చేసిందేమి లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బంగారు వేణుగోపాల్, మండల పార్టీ నాయకులు కాంపెల్లి పూర్ణచందర్ రావు, పట్టణ పార్టీ నాయకులు కోల శ్రీనివాసు, బీజేవైఎం జిల్లా నాయకులు ఆర్నే సతీష్, స్థానిక నాయకులు అనుమండ్ల శ్రీధర్ రెడ్డి, బత్తుల నరేష్, కిషోరం కుమార్, సీనియర్ నాయకులు కుమ్మరి మల్లయ్య, నాయకులు కాకోళ్ల బాలజీ, వెంకటేష్ పాల్గొన్నారు

'ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలి'

మంచిర్యాల రూరల్ : భూకబ్జాలకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం హాజీపూర్ మండలంలోని ముల్కల్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ భూమి కబ్జాపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని రెవెన్యూ అధికారులు స్పందించి దోషులు ఎవరో తెల్చాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకులు ఇష్టారీతిన భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భూ కబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునే వరకు బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి తిరుపతి, నాయకులు కృష్ణమూర్తి, రవిందర్, శ్రావణ్, చంద్రయ్య, సునీల్, నరేష్, తిరుపతి, బాలు పాల్గొన్నారు.

తప్పని తిప్పలు



వంతెన వద్ద బురదలో కూరుకుపోయిన లారీ

జన్నారం: మండలంలోని మహ్మదాబాద్ వాగువద్ద ఇటీవల వంతెన నిర్మించారు. అయినా వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. వంతెన పూర్తయి రోడ్డు అనుసందానంలో నాసిరకంగా రోడ్డు వేయడంతో వాహనాలు బురదలో కూరుకుపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి వంతెన రోడ్డు పూర్తిస్థాయిలో పటిష్టపరచాలని ప్రజలు కోరుతున్నారు.

'అన్యాక్రాంత భూములపై న్యాయ విచారణ చేపట్టాలి'



సమావేశంలో మాట్లాడుతున్న లాల్‌కుమార్

మంచిర్యాల రూరల్: మంచిర్యాల జిల్లాలోని అన్యాక్రాంతమైన భూములపై సమగ్ర న్యాయవిచారణ చేపట్టి భూ కబ్జాదారులను ప్రభుత్వం వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి లాల్‌కుమార్ అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ భూములు, చెరువు శిఖం, సీలింగ్, ఇనాంభూములు, జంగు సిపాయి తదితర భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై పేదలకు చెందాల్సిన భూములను కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. బలవంతపు భూకబ్జాలు అధికారాన్ని అడ్డం పెట్టుకొని అందిన కాడికి దండుకుంటున్నారని ఆరోపించారు. ప్రజల పక్షాన పోరాడే పార్టీలు, ప్రజా స్వామిక వాదులు, స్వచ్ఛంద సంస్థలు అనేక సార్లు ప్రభుత్వం, పాలకుల దృష్టికి తీసుకెళ్లి అనేక ఆందోళన చేసినప్పటికీ కబ్జాలు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు డీ సంపత్‌కుమార్, టీ. శ్రీనివాస్, బ్రహ్మానందం, డివిజన్ నాయకులు జే దేవరాజ్, మంగ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి సాజిత్, వరణ్, ప్రవీణ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

వ్యవసాయ పరిశోధనల్లో చివరిస్థానం

◆ ఆదిలాబాద్ జిల్లాలో ఏళ్ల తరబడి శాస్త్రవేత్తల పోస్టులు ఖాళీ ◆ 3న ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆవిర్భావ దినోత్సవం

విభిన్న వాతావరణ పరిస్థితులకు తట్టుకునే నూతన వంగడాలకు రూపకల్పన చేయాల్సిన జిల్లా వ్యవసాయ పరిశోధన స్థానం పరిస్థితి అట్టడుగునకు పడిపోతుంది. జిల్లాకు అనువైన పంటల పరిశోధనలతోపాటు రైతులు ఆసక్తి చూపే పంటల సాగుకు అనుగూనంగా విత్తన ఉత్పత్తి జరుగడంలేదు. యేళ్ల తరబడి శాస్త్రవేత్తల పోస్టులు ఖాళీగా ఉండడంతో పరిశోధనలు ఏమాత్రం ముందుకెళ్లడంలేదు. ఫలితంగా అధిక దిగుబడులు సాధించే నూతన వంగడాలు అందుబాటులో లేక సాగు లాభసాటిగా మారడంలేదు. మారుతున్న కాలానికి అనుగూణంగా విత్తనోత్పత్తిని చేసేందుకు 1958 సంవత్సరంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సుమారుగా 40 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ పరిశోధన స్థానంను ఏర్పాటు చేశారు. 50ఏళ్లు గడిచిన్నా ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించక ప్రశ్నార్థకంగా మారుతోంది. స్వరాష్ట్రం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో శాస్త్రవేత్తల పోస్టులు భర్తీకి నోచుకోవడంలేదు. ఉన్నా కిందిస్థాయి సిబ్బందితోనే పరిశోధన స్థానాన్ని నెట్టుకొస్తున్న దుస్థితి ఏర్పడుతోంది. ఇంకా పురాతన పద్ధతుల్లోనే పరిశోధనలు జరుగడం గమనార్హం. దీంతో మేలు రకం విత్తన ఉత్పత్తికి అవకాశం లేకుండా పోతుంది. జిల్లాలో అధికంగా సాగయ్యే మెట్టపంటలైన పత్తి, సోయా పంటల పరిశోధనలకే పరిమితం కావడంతో మిగితా పంటలైన కంది, శనగ, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, పంటలపై దృష్టి సారించకపోవడంతో జిల్లా రంతాంగానికి పూర్తిస్థాయిలో పరిశోధన ఫలాలు అందడంలేదు. దేశస్థాయిలో సోయా పంటపై పరిశోధనలు జరుగుతున్న ప్రధాన కేంద్రాలలో ఒకటిగా చెప్పుకునే ఆదిలాబాద్ వ్యవసాయ పరిశోధన స్థానంపై రాష్ట్ర ప్రభుత్వానికి పట్టింపు కరువవుతోంది. వచ్చే నెల సెప్టెంబర్ 3న ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 3వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోనుంది.


ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ పరిశోధన కార్యాలయం

● భర్తీకి నోచుకోని శాస్త్రవేత్తల పోస్టులు

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగూణంగా విత్తన ఉత్పత్తి జరుగాల్సి ఉంది. దీనికి తగట్టుగా శాస్త్రవేత్తల నియామకాన్ని చేపట్టాలి. కాని యేళ్ల తరుబడి పోస్టులు భర్తీకి నోచుకోకపోవడంతో వ్యవసాయ పరిశోధన స్థానంపై రైతుల్లో నమ్మకం పోతోంది. ఒక ప్రధాన శాస్త్రవేత్తతో పాటు మొత్తం ఏడుగురు శాస్త్రవేత్తలు పని చేయాల్సి ఉండగా ప్రస్తుతం ఐదుగురు శాస్త్రవేత్తలు మాత్రమే ఉన్నారు. ఇందులో ప్రధాన శాస్త్రవేత్త, సీనియర్ శాస్త్రవేత్తలు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. అలాగే బోధనేతర సిబ్బంది పోస్టులు 17 కాగా, ప్రస్తుతం ఏడుగురు మాత్రమే పని చేస్తున్నారు. మిగితా 10 పోస్టులు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. అందుబాటులో ఉన్న శాస్త్రవేత్తలు కూడా నాన్‌బిటీ విత్తనోత్పత్తిపైననే పరిశోధనలు జరుపుతున్నారు. అయితే రైతులు మాత్రం బీటీ విత్తనాల వైపు మొగ్గు చూపడంతో పరిశోధనలు చేసినా ఫలితం లేకుండా పోతుంది. గడిచిన 20ఏళ్ల నుంచి కొత్త పోస్టులు మంజూరు కాకపోవడంతో పంటల సాగులో పరిశోధన స్థానం పాత్ర నామమాత్రంగానే మారుతోంది.

● పత్తి, సోయా పంటలకే పరిమితం

జిల్లా పరిశోధన కేంద్రంలో కేవలం పత్తి, సోయా పంటల పరిశోధనలకే శాస్త్రవేత్తలు పరిమితమవుతున్నారు. అసలు 16రకాల పంటలపై పరిశోధనలు చేయాల్సి ఉండగా రెండు పంటలకే పరిమితం కావడం పరిశోధన స్థానం పరిస్థితికి అద్దం పడుతోంది. ప్రభుత్వం గత రెండేళ్లుగా పత్తి పంట సాగు వదంటూ ప్రచారం చేస్తున్నా అదే పంటపై పరిశోధనలు జరుగడం అయేమయ పరిస్థితులకు దారితీస్తోంది. జిల్లాలో అధికంగా సాగయ్యే కంది, శనగ, పెసర, మినుము, చిరు ధాన్యాలైన జొన్న, మొక్కజొన్న, నువ్వులు, ఆవాలు, వేరుశనగ, నూనె గింజలపై పరిశోధనలు జరుగడంలేదు. ముఖ్యంగా ఖరీఫ్ పంటలపైననే దృష్టి సారిస్తున్న శాస్త్రవేత్తలు రబీ సీజన్‌లో అధికంగా సాగయ్యే వేరుశనగ, శనగ పంటలపై పరిశోధనలు చేయడంలేదు. దీంతో మేలు రకం విత్తనం అందుబాటులో లేక మహారాష్ట్ర, ఇతర జిల్లాలపై ఆధారపడాల్సి వస్తుంది. అలాగే జిల్లాలో ఇప్పుడిప్పుడే సాగు విస్తీర్ణం పెరుగుతున్నా పసుపు, మిర్చి, పొగాకు పంటల ఊసేలేకుండా పోతుంది. ప్రధానంగా వాణిజ్య పంటలపై దృష్టి సారిస్తే రైతులకు ప్రయోజనం కలుగనుంది.

● మరిన్ని పరిశోధనలకు ప్రయత్నం చేస్తున్నాం

- డాక్టర్ శ్రీధర్ చౌహాన్, సీనియర్ శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్ జిల్లా



ఇప్పటికే జరుగుతున్న పరిశోధనలతో పాటు మరిన్ని పరిశోధనలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. జిల్లాలో అధికంగా పండించే శనగ, వేరుశనగ, పంటలపై పరిశోధనలకు అవకాశం కల్పించాలని యూనివర్సిటీకి నివేధించడం జరిగింది. ఆదేశాలు అందగానే పరిశోధనలు చేపడతాం. శాస్త్రవేత్తల పోస్టులు ఖాళీగా ఉండడంతో ఇబ్బందిగానే మారుతుంది.

● కనిపించని కీటక, వ్యాధుల విభాగాలు

కొత్త రకం విత్తనోత్పత్తితోపాటు పంటల సస్యరక్షణపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పంటలకు సోకే వ్యాధులు ఆశించే కీటకాల నియంత్రణపై ఎలాంటి పరిశోధనలను చేపట్టడంలేదు. ఇప్పటికీ ఈ విభాగాల్లో పని చేసే శాస్త్రవేత్తలు అందుబాటులో లేరు. మార్కెట్‌లోకి వస్తున్న బీటీ విత్తనాలపై రైతులు మోజు పడి సాగుచేస్తున్నా చీడపీడలు ఆశించి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతుల్లో సస్యరక్షణ చర్యలపై అవగాహన కరువై పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పత్తి పంటను తీవ్రంగా నష్టపరిచే గులాబి పురుగు నియంత్రణపై ఇప్పటికీ రైతుల్లో అవగాహన కరువవుతుంది. అలాగే ఎరువులు, గడ్డిమందుల వాడకం, అంతర పంటల సాగుపై ఏమాత్రం అవగాహన లేక నష్టపోతున్నారు. జిల్లాకు అనువైన పంటలపై మరిన్ని పరిశోధనలు జరిగితేనే జిల్లా రైతాంగానికి ప్రయోజనం చేకూరనుంది.

(- ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్)

ఏకీకృత సర్వీస్ రూల్స్ కోసం ఐటీడీఏ ముందు ధర్నా

ఉట్నూర్: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐటీడీఏ ప్రాంతాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఏకీకృత సర్వీస్‌రూల్స్ కల్పించాలంటూ ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ముందు ఉమ్మడి జిల్లాలోని ఐటీడీఏ ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఐటీడీఏముందు ఏర్పాటు చేసిన ధర్నా శిభిరంలో ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ముందుగా కుమ్రంభీం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు ఆర్పించారు. అనంతరం ఈ సందర్భంగా ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మెస్రం మోతిరాం మాట్లాడుతూ రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో ఉన్న ఐటీడీఏల వద్ద ఉమ్మడి సర్వీస్ రూల్స్ కోసం ధర్నా చేపట్టామని అన్నారు. పదోన్నతుల్లో గిరిజనులకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. కొన్ని గిరిజనేతర ఉపాధ్యాయ సంఘాల ప్రభుత్వ ఉత్తర్వులను వక్రీకరించి ఐటీడీఏ ఉపాధ్యాయులకు అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. గిరిజనేతర ఉపాధ్యాయ సంఘాలు జేఏసీ ముసుగులో గిరిజనుల కోసం పోరాటాలు చేస్తున్నమంటూ వంచిస్తు వస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఐటీడీఏ ఉపాధ్యాయులకు ఏక్రీకృత సర్వీస్‌రూల్స్ వర్తింప చేసి, సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, బదిలీలు, నియామకాలు, పదోన్నతులు జీవో 3 ద్వారా చేపట్టాలని, అన్ని రకాల పదోన్నతులు గిరిజనులకే ఇవ్వాలని, ఆశ్రమ పాఠశాలల్లో, కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీలను రెగ్యూలర్ చేయాలని, ఏజెన్సీ ప్రాంతాలలో ఏజెన్సీ డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, పదవ పీఆర్సీ ప్రకారం సీఆర్టీల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కనక ఆమారావు, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కుర్సింగ సూర్యభాన్, కుమ్రంభీం జిల్లా అధ్యక్షుడు అనక దేవేందర్, రాష్ట్ర కార్యదర్శి కోవ నాగోరావు, త్రొడసం జంగు, మడావి సుంగు, అడ వెంకటేశ్, మెస్రం లీలాబాయి, జానకి, మున్నిబాయి, కోవ శకుంతల, పుర్కా గజానంద్, మడావి తులసీదాస్, వెడ్మబొజ్జు, ఆత్రం తిరుపతి, కోట్నాక్ గణపతి, మడావి సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీల్లో అవకతవకలను సహించేది లేదు'

తాంసి: అంగన్‌వాడీ కేంద్రాల్లో అవకతవకలు జరిగితే సహించేదిలేదని మహిళా శిశు సంక్షేమ శాఖ చైర్మన్ కస్తాల ప్రేమల అన్నారు. సోమవారం మండలంలోని పొన్నారి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో కేంద్రాల్లో పిల్లలకు వడ్డిస్తున్న భోజనం గురించి ఆరా తీశారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏ సమయానికి వస్తున్నారు? విద్యాబోధన ఏ విధంగా జరుగుతుంది? ప్రతీరోజు మెనూ ప్రకారం సరుకులు పంపిణీ చేస్తున్నారో? లేదో? విషయంపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ప్రతీ అంగన్‌వాడీ సమయపాలన ప్రకారం పని చేయాలన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది స్థానికంగా ఉండాలన్నారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం వడ్డించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొన్ని కేంద్రాల్లో అంగన్‌వాడీ నిర్వాహకులు సమయ పాలన పాటించడంలేదని, ఇక నుంచైనా వారి సమయంలో మార్పు చేపట్టాలన్నారు. పొన్నారి అంగన్‌వాడీ-1లో పలు ఫిర్యాదులు వస్తున్నాయని, ఇక నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా నిర్వాహకురాలు చూసుకోవాలన్నారు. మూడేళ్లలోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందు కోసం ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఇందులో ఎంపీటీసీ రమణ, ఉప సర్పంచ్ దేవేందర్, అంగన్‌వాడీ నిర్వాహకులు దేవమ్మ, గంగమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ ఎప్పుడు?

❖ బాసర ఆలయ విగ్రహ ఘటనపై దేవాదాయ శాఖ నిర్లక్ష్యం ❖ విచారణకు మంత్రి ఆదేశించి 20 రోజులు

బాసర: నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం నుంచి విగ్రహాన్ని తీసుకువెళ్లి నల్గొండ జిల్లా దేవరకొండలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆలయ పండితులు పూజలు నిర్వహించిన తీరు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. గత నెల 28వ తేదీన జరిగిన ఈ ఘటనపై ఇంకా అనేక అనుమానాలు, ఆరోపణలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. ఆలయం నుంచి విగ్రహం తీసుకెళ్లినప్పటి నుంచి పూజలు నిర్వహించి.. అనంతరం ఆలయంలో పండితులు యథాస్థానంలో విగ్రహాన్ని ఉంచేంత వరకు ఆలయ అధికారులు కనిపెట్టడంలో ఆలయ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈనెల 2వ తేదీన అధికారులు సదరు ఇద్దరు పండితులకు చార్జి మెమోలు జారీచేసి చేతులు దులుపుకున్నారు. ఆ తరువాత స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. మళ్లీ ఆ పూజలో మూడవ పూజారి పాత్రపై 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ పూర్తి ఘటనపై దేవస్థాన అధికారుల పరిపాలనా లోపాలు కూడా భయటపడ్డాయి. విగ్రహాన్ని తీసుకువెళ్లి పూజలు నిర్వహించడమే కాక, తిరిగి పండితుడు ఆలయంలోని తన బీరువాలో పెట్టుకునేంత వరకు అధికారులకు తెలియకపోవడంపై స్థానికుల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


దేవరకొండలో బాసర ఆలయ పండితులు నిర్వహించిన పూజలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు (ఫైల్)

● మంత్రి ఆదేశించి 20 రోజులు గడిచినా..

ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో జిల్లాకు చెందిన దేవాదాయ శాఖ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. చార్జి మెమోలు ఇచ్చి చేతులు దులుపుకున్న ఆలయ అధికారులకు బాధ్యుతలైన పండితులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. అంతేగాకుండా న్యాయపరంగా వారికి ఎలాంటి వెసులుబాటు దొరకకుండా ముందు జాగ్రత్తగా రాష్ట్ర హైకోర్టులో కేవీటీని దేవాదాయ శాఖ అదికారులు మంత్రి సూచనల మేరకు దాఖలు చేశారు దీంతో పాటు ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఈనెల 9వ తేదీన మంత్రి ఆదేశించారు. దేవాదాయ శాఖలో నిజాయితీగా పేరున్న రీజినల్ జాయింట్ కమీషనర్ కృష్ణవేణి ఈ ఏకసభ్య కమిటీకి నియమిస్తున్నట్లు మంత్రి ఆరోజు ప్రకటించారు. నేటికి 20 రోజులు గడిచినా ఇప్పటివరకు ఏ అధికారి బాసరకు రాలేదు. తీవ్ర వివాదాస్పదమైన ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఇతర కారణాలను తెలుసుకునే విషయంలో దేవాదాయ శాఖ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శలు ఉన్నాయి. ఈ ఏకసభ్య కమిటీ బాసరతో పాటు దేవరకొండలోని పూజలు నిర్వహించిన ప్రైవేటు పాఠశాలలో కూడా విచారణ చేపట్టే అవకాశం ఉంది.

● ఇంకా అజ్ఞాతంలోనే పండితుడు

పూజలు నిర్వహించిన ఘటనలో ప్రధాన పాత్రదారిగా భావిస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్‌కుమార్ ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారు. ఈ విషయం వెలుగులోకి రాగానే ఆయన నాటకీయ పరిణామాల మధ్య మొదట నిజామాబాద్, ఆతరువాత హైదరాబాద్ ఆసుపత్రులకు వెళ్లారు. గుండెకు సంబంధించిన చికిత్స తీసుకుంటున్నట్లు ఆయన ఈ నెల మొదటి వారంలోనే ప్రకటించారు. అయితే, ఇప్పటికే ఆయనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విగ్రహం విషయంలో కేసు కూడా నమోదైంది. ఆనాటి నుంచి ఇప్పటి వరకు ఆ పండితుడి ఆచూకీ తెలియరాలేదు. అతని ఆచూకీ కోసం పోలీసులు కనుగొంటున్నట్లు సమాచారం. అయితే మంత్రి ఆదేశించిన విచారణ కమిటీ, దేవస్థాన అదికారులు, సిబ్బందితో పాటు పూజలో పాల్గొన్న పండితులను కూడా విచారించాల్సి ఉంటుంది. ఆలయ ప్రధాన పండితునితో పాటు పూజలో పాల్గొన్న మరో ఇద్దరు పండితులు కూడా స్థానికంగా కనిపించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పండితులందరూ వస్తే తప్ప ఈ ఘటనపై పూర్తి విచారణ సంపూర్ణమయ్యే అవకాశం లేదు.

గులాబీ శ్రేణులకు పదవుల పందేరం

■ రైతుల సేవా సమితిల ఏర్పాటుకు సన్నాహాలు ■ నామినెటేడ్ పద్ధతుల్లో పదవుల భర్తీ ■ జిల్లా ఇన్‌చార్జీగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



గత మూడున్నరేళ్ల నుంచి పదవుల కోసం ఎదురుచూస్తున్న అధికార టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఊరట లభించబోతోంది. ప్రభుత్వం భూముల అవకతవకలను నిరోధించేందుకు గ్రామస్థాయి నుంచి సమగ్ర భూ సర్వే చేపట్టేందుకు నిర్ణయించింది. అయితే ఈ సర్వే ఆయా గ్రామస్థాయిలో నియమించబోయే రైతు సేవా సమితిలనేతృత్వంలో జరగబోనుంది. ఇక నుంచి భూముల యాజమాన్యాల నిర్ధారణ ఆయా గ్రామాల్లో నెలకొన్న భూ వివాదాల పరిష్కారం లాంటి వ్యవహారాలన్ని రైతు సేవా సమితిల పరిధిలోకి రాబోతున్నాయి. గ్రామాల్లోని రైతు సేవా సమితిల భూ యాజమాన్యాలను నిర్ధారించిన తరువాతనే రెవెన్యూ అధికారులు పట్టాదార్ పాస్ పుస్తకాలతో పాటు పహనీ, తదితర వాటిని తదితర యాజమాన్య ధృవీకరణ పత్రాలను జారీ చేయనున్నారు. దీని కోసం గాను సెప్టెంబర్ 9వ తేదీలోగా గ్రామ, మండల, జిల్లాస్థాయి రైతు సేవా సమితిలను నియమించబోతున్నారు. గ్రామస్థాయిలో 15 మంది, మండల స్థాయిలో 24 మందిని సభ్యులుగా నియమించనున్నారు. అలాగే వీరితో పాటు జిల్లాస్థాయిలో 42 మందిని జిల్లాస్థాయి సమితిలో నియమించబోతున్నారు. రైతు సేవా సమితిల నియమకాలన్నింటిని ఆయా జిల్లా ఇంచార్జీ మంత్రుల పర్యవేక్షణలో నామినెట్ చేయనున్నారు. నిర్మల్ జిల్లాకు ఇన్‌చార్జీగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని నియమించారు. ఆయనకు మంచిర్యాల జిల్లాను కూడా పదవుల నియమాకం కోసం అప్పగించారు. ఒకేసారి గ్రామంలో 15 మందికి, మండలస్థాయిలో 24మందికి నామినెటేడ్ పదవులు దక్కబోతున్నాయి. ఈ పదవుల నియమాక ప్రక్రియ గులాబీ శ్రేణులకు కొత్త ఉత్సాహం నింపబోతుందంటున్నారు. అయితే భూముల సర్వే వ్యవహారం ఈ సమితిలకు కత్తిమీద సాముల మారనుందంటున్నారు. భూముల యాజమాన్య నిర్ధారణ, హద్దుల నిర్ధారణ వ్యవహారాల్లో వివాదాలు తలెత్తే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● టీఆర్ఎస్ కార్యకర్తల్లో సంబురం

కాగా, ప్రతి రెవెన్యూ గ్రామ పరిధిలో రైతు సేవా సమితిలను ఏర్పాటు చేసి ఏర్పాటు చేయబోతుండడం పట్ల అధికార టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సంబుర పడుతున్నారు. ప్రతీ రెవెన్యూ గ్రామంలో 14 మందికి పదవులు దక్కబోతున్నాయి. దీనికి తోడు సీనియర్ నాయకులు మండల స్థాయి, జిల్లాస్థాయి సమితి పదవులపై దృష్టి సారించనున్నారు. సీనియర్ నాయకులందరికి ఏదో ఒక పదవి దక్కబోతుందంటున్నారు. దాదాపు మూడున్నర ఏళ్ల నుంచి నామినేటెడ్ పదవుల కోసం ఎదరు చూస్తున్న ఆ పార్టీ శ్రేణులకు రైతు సేవా సమితి వ్యవహారం ఊరటనివ్వబోతుందంటున్నారు. నిర్మల్ 429 రెవెన్యూ గ్రామాలు ఉండగా ఈ గ్రామాల్లో 6,435 మందికి పదవులు దక్కబోతున్నాయి.

● 9లోగా నియామక ప్రక్రియ పూర్తి

గ్రామ, మండల, జిల్లాస్థాయి రైతు సేవా సమితి సభ్యుల నియమాక ప్రక్రియను సెప్టెంబర్ 9లోగా పూర్తి చేయబోతున్నారు. మొదట గ్రామస్థాయిలో సమితి సభ్యులను నియమిస్తారు. ఆ తరువాత మండలస్థాయిలో 24 మందితో సమితి ఏర్పడబోతుంది. అనంతరం 42 మందితో జిల్లాస్థాయిలో సమితిని ఏర్పాటు చేయనున్నారు. ఆయా గ్రామాల్లోని భూ సర్వే నివేదికలను మండలస్థాయి కమిటీలు ధ్రువీకరిస్తాయి. అనంతరం జిల్లాస్థాయి సమితి సర్వే నివేదికలను ఖరారు చేయడమే కాకుండా వివాదాలు, తదితర కీలక అంశాలను పరిష్కరిస్తాయి. సమితి సభ్యుల నియమాక వ్యవహారం పూర్తి కాగానే అధికారుల బృందాలు ఇక గ్రామబాట పట్టనున్నాయి. దాదాపు మూడు నెలల పాటు భూ సర్వే ప్రక్రియను కొనసాగించనున్నారు.

● మంత్రి ఐకే.రెడ్డికి పగ్గాలు

గ్రామ, మండల, జిల్లాస్థాయి రైతు సేవా సమితి సభ్యులను నియమాక ప్రక్రియను ఆయా జిల్లా ఇంచార్జీ మంత్రులకు అప్పజెప్పారు. నిర్మల్ జిల్లా భాధ్యతలను స్థానిక మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేతికి ఇచ్చారు. నిర్మల్ జిల్లాతో పాటు మంచిర్యాల్ జిల్లాకు కూడా ఇంద్రకరణ్‌రెడ్డి ఇన్‌చార్జీగా వ్యవహరించబోతున్నారు. ఆయన నేతృత్వంలోనే పదవుల నియమాక ప్రక్రియ కొనసాగనుంది. పార్టీ కోసం పని చేస్తున్న నాయకులు , కార్యకర్తలకు సమితి నియమకాల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. దీని కోసం గాను సోమవారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఆయా మండలస్థాయి నాయకులతో పదవుల నియామకంపై సుదీర్ఘంగా చర్చించడం గమనార్హం. అయితే జిల్లాలోని 19 మండలాలకు సంబంధించిన సీనియర్ నాయకుల జాబితాతో పాటు పదవులను ఆశిస్తున్న వారి జాబితాను సిద్ధం చేయాలంటూ మంత్రి సూచించారు.

● కీలకం కానున్న సమితి ధ్రువీకరణలు

గ్రామాల్లో చేపట్టబోతున్న సమగ్ర భూ సర్వే ప్రక్రియలో రైతు సేవా సమితిల పాత్ర కీలకం కాబోతుంది. సర్వే సందర్భంగా ఏర్పడే వివాదాలను రైతు సేవా సమితి పరిష్కరించాల్సి ఉంటుంది. మొదట భూముల హద్దులతో పాటు రికార్డులను సర్వే చేపట్టబోతున్నారు. యాజమాన్యాల నిర్ధారణ విషయంలో పెద్ద ఎత్తున వివాదాలు తలెత్తే అవకాశాలున్నాయంటున్నారు. రైతు సేవా సమితి ధ్రువీకరణ తరువాత యాజమాన్య హక్కులు అధికారికం కానున్నాయి. క్రయవిక్రయాలు అనువంశికంగా వచ్చే భూములతో పాటు అసైన్డ్, వక్ఫ్, శిఖం, దేవాదాయ భూముల్లాంటి వ్యవహారాల్లో యాజమాన్య అంశం వివాదాలకు కారణం కానుందంటున్నారు. ఇలాంటి అంశాల్లో రైతు సేవా సమితిల ధ్రువీకరణ కీలకంగా మారనుంది.

(- ఆంధ్రజ్యోతి, నిర్మల్)



నిండుకుండలా కడెం ప్రాజెక్టు

కడెం ప్రాజెక్టులోకి కొనసాగుతున్న వరద

● **వరద గేటు ఎత్తివేత.. ప్రస్తుతం 698.4 అడుగుల నీరు**

కడెం: నిర్మల్ జిల్లాలో అతిపెద్దదైన కడెం ప్రాజెక్టులోకి వరద నీరు రాక కొనసాగుతోంది. గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రాజెక్టులోకి 4,971 క్యూసెక్యుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు పూర్తిసామర్థ్యం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 698.4 అడుగుల నీటిమట్టం ఉంది. ప్రాజెక్టులోకి వరద నీరు రాకడ కొనసాగడంతో ప్రాజెక్టు ఒక వరద గేటు ఎత్తివేసి 5,200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

‘సీపీఎస్ విధానం సహేతుకం కాదు’

నిర్మల్ కల్చరల్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం సహేతుకం కాదని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిరెడ్డి అన్నారు. నిర్మల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1న మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వివిద సంఘాలతో కలిసి జాక్టో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సీపీఎస్ విధానం సమైఖ్యవాదుల పాలనలో ప్రవేశపెట్టారని అన్నారు. 2004లో మన రాష్ట్రంలో సీపీఎస్ విధానం ప్రవేశపెట్టి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు అన్యాయం చేసిందన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సీపీఎస్ విధానం రద్దు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని వోపీఎస్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడున్నర లక్షల మంది పెన్షన్ పొందలేక అన్యాయానికి గురవుతున్నారన్నారు. సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబర్ 1న తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట సామూహికంగా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నాలో పాల్గొని సిపిఎస్ రద్దుకు మద్దతు పలకాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, జిల్లా అధ్యక్షుడు మురళీ మనోహర్ రెడ్డితో పాటు లక్ష్మి ప్రసాద్ రెడ్డి, నాగభూషణం, తదితర నాయకులు పాల్గొన్నారు.

అటవీశాఖలో కొలువుల జాతర



● జిల్లాలో ఖాళీగా 73 బీట్ అధికారుల పోస్టులు ● దరఖాస్తులు స్వీకరిస్తున్న టీఎస్‌పీఎస్సీ

భైంసా: అటవీశాఖలో కొలువుల భర్తీ జాతర మొదలయ్యింది. రాష్ట్ర సర్కార్ హరిత హారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్న అటవీశాఖాధికారుల కొలువుల భర్తీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఊరటనిచ్చింది. నిర్మల్ జిల్లా పరిధిలో మొత్తం 73 బీట్ అధికారుల పోస్టులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ప్రకటన వెలువరించింది. ప్రస్తుతం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలయ్యింది. వచ్చె నెల 12 వరకు దరఖాస్తులు సమర్పించేందుకు గాను గడువు ఉంది. టీఎస్‌పీఎస్సీ ప్రకటన వెలువడటంతో దరఖాస్తు చేసుకున్న, చేసుకుంటున్న అభ్యర్థులు ప్రణాళికాబద్ధమైన విధానాల ద్వారా పరీక్షలకు సిద్దమవుతున్నారు.

● కోచింగ్ సెంటర్ల ఏర్పాట్లు

జిల్లా కేంద్రంతో పాటు ప్రధాన కేంద్రాల్లో కోచింగ్ సెంటర్‌లు అభ్యర్థులకు శిక్షణను అందించేందుకు గాను ఏర్పాట్లు చేపట్టాయి. జారీ చేసిన నోటిఫికేషన్ ప్రక్రియకు అనుగుణంగా సిబ్బంది నియమాకాలు జరిగితే జిల్లా పరిధిలో ప్రస్తుతం అటవీశాఖలోనున్న ఉద్యోగులపై పని భారం తగ్గనుంది. ప్రస్తుతం అటవీశాఖలో బీట్, సెక్షన్ అధికారుల కొరతతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పనిభారంతో సతమతమవుతున్నారు. హరితహారం కార్యక్రమంలో సైతం ఆశించిన ఫలితాలు అంతగా రావడం లేదు. ఇక ఉద్యోగుల భర్తీ జరుగనుండటంతో అటవీశాఖలో సేవలు పూర్తిస్థాయిలో మెరుగుపడనున్నాయి.

● అటవీశాఖ బీట్ అధికారుల ఖాళీలు

జనరల్ 49, మహిళలు 24 కలిపి మొత్తం 73 ఖాళీలున్నాయి. అయితే, కేటగిరీ వారీగా భర్తీ ఇలా.. జిల్లా పరిధిలో ఓసీ జనరల్‌కు 23, మహిళలకు 13, ఎస్సీ జనరల్‌కు7, ఎస్సీ మహిళకు 4, ఎస్టీ జనరల్‌కు 4, ఎస్టీ మహిళకు1, బీసీ(ఎ)లో జనరల్‌కు 4, మహిళకు 1, బీసీ(బి)లో జనరల్‌కు 5,మహిళకు 3,బీసీ (సి)లో జనరల్‌లో 1, బీసీ (డి)జనరల్‌లో 3, మహిళకు 1, బీసీ (ఈ)జనరల్‌కు2, మహిళకు 1 కేటాయించారు.

వర్షాలకు నేలపాలైన మినుము పంట

● ఆందోళనలో రైతులు

భైంసా రూరల్: మండలంలో మినుము పంట వేసిన రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి భారీ వర్షాలకు పంట నేలకూలింది. నష్టం సంభవించింది. మండలంలో సమారు 8వేల ఎకరాల వరకు మినుము పంటను సాగు చేసినట్లు క్షేత్రస్థాయిలో తెలుస్తుంది. దీంతో పాటు మరో మూడు వేల ఎకరాల్లో పెసరు పంట సాగైంది. విత్తనాలు వేసి ఆశాజనకంగా పంటులు ఎదుగుతున్న సమయంలో దాదాపు నెల రోజుల వరకు వర్షాలు ముఖం చాటేశాయి. కీలకమైన పూత, పిందె దశలో వర్షాలు ముఖం చాటేయడంతో అంటినట్లుగా ఖాత పట్టింది. అది చేతికి వచ్చే సమయానికి గత 15 రోజులుగ వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంటలు కోయలేక పోతున్నారు. పంట కోసేందుకు అవకాశం కోసం ఎదురుచూస్తున్న రైతులకు వర్షం కారణంగా అందును చిక్కడం లేదు. దీంతో పంటలు చేనులోనే నేలకొరిగి పోతున్నాయి. అంతే కాకుండా, కొన్ని చోట్ల మొలకెత్తగా మరి కొన్ని చోట్ల దుబ్బిపోతున్నాయి. ఒక ఎకరానికి ఏడు నుంచి పది వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులకు నష్టాలే మిగిలాయి దీంతో రైతుల పంటలకు పెట్టిపెట్టుబడులు చేతికందక నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతుల పరిశీలించి వారిని ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని రైతులు కోరుతున్నారు.

● రెండు ఎకరాల్లో మినుము సాగు చేశా

- శ్రీనివాస్‌రెడ్డి, రైతు, దేగాం



రెండు ఎకరాలలో మినుము పంటను సాగు చేశా. వర్షాలు లేకపోవడంతో కొంత మేక ఖాత పట్టింది. పెట్టినపెట్టుడులు చేతికివస్తాయనుకున్న కానీ, ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఆ కాస్త పంట నేలపాలైంది. రైతుల పంటను పరిశీలించి ప్రభుత్వం రైతులకు ఆదుకోవాలి.

● పెట్టుబడులు సైతం చేతికి రాలేదు


- సాయినాథ్, రైతు, ఇలేగాం



మినుము పంట కోసం ఎకరానికి రూ.7 వేలు ఖర్చు చేశా. పంట చేతికి వచ్చే తరుణంలో కోత కోయడానికి వీలు లేకుండా పోయింది. కనీసం పంట సాగుకోసం పెట్టిన పెట్టుబడులు చేతికి రాలేదు. పూర్తిగా నష్టపోయాం. ఈ విషయమై తమను ప్రభుత్వమే ఆదుకోవాలి.

మట్టికింద మహా అన్వేషణ


మట్టి కుండల పెంకులు


రంగు రాళ్లు


ఇసుర్రాయి


ఎముకలను పోలిన వస్తువులు

మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలం కర్ణమామిడి సమీపంలోని పాటిగడ్డ ఒకప్పుడు శాతవాహనులకు కీలక స్థావరంగా ఉండేదని తెలుస్తున్నది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ అనుమతితో పురావస్తుశాఖ జూన్6 నుంచి తవ్వకాలు ప్రారంభించగా, ఇప్పటికి వేల ఏళ్ల కిందటి చారిత్రక అవశేషాలు బయటపడుతున్నాయి. మరిన్ని ఆధారాలను వెలికితీసి ప్రపంచానికి తెలియజెప్పే ప్రయత్నాల్లో అధికారులు తలమునకలయ్యారు.

◆ ఆంధ్రజ్యోతి, మంచిర్యాల

● శాతవాహనుల తొలిరాజధాని కోటిలింగాల

ప్రస్తుత జగిత్యాలజిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాలలో 1979-84 మధ్య కాలంలో జరిగిన తవ్వకాలలో 100 ఎకరాల్లో విస్తరించిన అతి ప్రాచీన కోట బయటపడింది. ఇక్కడ ఆరు పొరల్లో జరిపిన తవ్వకాల్లో ఇటుక గోడలు, బురుజులు, ముద్రణాయంత్రాలతో పాటు కత్తులు, కటార్లు, పూసలు, ఇతరత్రా వస్తు సామగ్రి బయటపడ్డాయి. తొలిశాతవాహన రాజు శ్రీముఖుడితో పాటు అంతకుముందున్న ఆంధ్రరాజుల నాణేలు కూడా వెలుగుచూశాయి. దీంతో ఇది శాతవాహన రాజుల తొలిరాజధాని అని తేలింది. తవ్వకాలకు ముందు సీమాంధ్ర చరిత్రకారులంతా శాతవాహనుల తొలిరాజధాని ప్రతిష్ఠానపురం(పైఠాన్) అనీ, మలి రాజధాని


తవ్వకాల్లో బయటపడ్డ ఇటుక గోడలు

ధాన్యకటకం(అమరావతి) అని వాదిస్తూ వచ్చారు. చరిత్ర పుస్తకాల్లోనూ అదే రాశారు. ఎక్కడా కోటిలింగాల పేరు ప్రస్తావించలేదు. అయితే 1979-84 మధ్య జరిగిన తవ్వకాల అనంతరం ఇవన్నీ అవాస్తవాలని తేలింది. ఇంకా ప్రస్తుత పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలంలోని ధూళికట్ట (ధూళికోట), పెద్దపల్లి సమీపంలోని పెద్దబొంకూర్ గ్రామం అప్పుడే వెలుగుచూశాయి. మెగస్తనీస్ తన ఇండికా గ్రంథంలో ఆంధ్రులకు 30 దుర్గాలు న్నాయని పేర్కొన్నారు. అందులో కోటిలింగాల ఒకటి కాగా, మరొకటి ధూళికట్ట అని భావిసు న్నారు. గోదావరికి ఆవల ఉన్న కోటిలింగాల ఒక రేవు పట్టణం కాగా, నదికి ఈవలి దిక్కు ఉన్న


ప్రస్తుతం తవ్వకాలు జరుగుతున్న ప్రదేశం

- శాతవాహనుల ఆనవాళ్ల కోసం సాగుతున్న తవ్వకాలు
- కర్ణమామిడిలో బయటపడుతున్న చారిత్రక అవశేషాలు
- మరిన్ని ఆధారాల సేకరణలో పురావస్తు అధికారులు
- జిల్లా చరిత్రను మలుపుతిప్పే అవకాశాలు

కర్ణమామిడి సైతం శాతవాహనుల కీలక స్థావరంగా వర్ధిల్లిందని పురావస్తు అధికారులు అంచనా వేస్తున్నారు. వారి అంచనా ప్రకారం, ఇక్కడి 40 ఎకరాల్లో పట్టణం, అదీ వర్తకవాణిజ్య కేంద్రంగా ఉండేది. తవ్వకాల ద్వారా దీనిని రుజువుచేయాలని భావిస్తున్నారు.

● ప్రస్తుతం ముంపు ముంగిట..

ప్రస్తుతం కర్ణమామిడితో పాటు, తవ్వకాలు జరుగుతున్న పాటిగడ్డ ముంపు ముంగిట నిలిచాయి. ఎల్లంపల్లిలోకి పూర్తిస్థాయిలో నీరు చేరితే బ్యాక్‌వాటర్‌లో మునిగిపోతాయి. అందువల్ల వీలైనంత త్వరగా తవ్వకాలు పూర్తిచేసి, మరిన్ని చారిత్రక అవశేషాలను వెలికి తీయాలని పురావస్తుశాఖ అధికారులు పట్టుదలతో ఉన్నారు. 'ప్రస్తుతం మా తవ్వకాల్లో శాతవాహనుల కాలం నాటి మీటరు పొడవు గల ఇటుక గోడ, అలంకరణ సామగ్రి, నూరేరాళ్లు, మట్టి కుండలు, ధాన్యపు గాదెలు, నాణేలు, ఇతర వస్తుసామగ్రి బయటపడ్డాయి..' అని పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. గోదావరి తీరాన కర్ణమామిడి సమీపంలో 40 ఎకరాల విస్తీర్ణంలో రేవు పట్టణం ఉండేదని, ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు ధాన్యం, ఇతర వస్తుసామగ్రి ఎగుమతయ్యేవని భావిస్తున్నారు. 'కర్ణమామిడి సమీపంలో పెద్ద బావి ఉండేది.. అందులో ఏనుగులు, గుర్రాలు, పశువులు నీళ్లు తాగేవట. మా తాత ముత్తాతలు చెబుతుండేవారు. ప్రస్తుతం ఆ బావి ఎల్లంపల్లిలో మునిగిపోయింది..' అని గ్రామపెద్దలు చెబుతున్నారు. మొత్తం మీద తాజా తవ్వకాల్లో కీలక ఆధారాలు లభిస్తాయనే ఆశ పురావస్తుశాఖ అధికారుల్లో కనిపిస్తున్నది. అప్పుడే ఈ ప్రాంత ఉజ్వల చరిత్ర బయటకు వచ్చే అవకాశముంది.

❑1980లో తొలిసారి తవ్వకాలు..

కోటిలింగాలలో చారిత్రక కోట బయటపడ్డ తర్వాత 1980లో తొలిసారి కర్ణమామిడిలో తవ్వకాలు ప్రారంభించినా, అనివార్య కారణాల వల్ల నిలిచిపోయాయి. ఆ తర్వాత తాజాగా గోదావరి ఒడ్డున సుమారు 5 ఎకరాల్లో మరోసారి తవ్వకాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం నాటి ప్రజలు వాడిన ఇటుకలు, కుండలు, మృణ్మయ పాత్రలు, పూసలు మొదలైన అలంకరణ సామగ్రి బయటపడుతున్నాయి. ఈ ప్రాంతాన్ని అప్పట్లో ఒక పట్టణంగా భావిస్తున్నామనీ, ఈమేరకు కీలక ఆధారాలు లభిస్తాయనే ఆశతో ఉన్నామని పురావస్తు అధికారులు చెబుతున్నారు. ఈ దఫా 45 రోజుల పాటు సుదీర్ఘంగా తవ్వకాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.


పాటిగడ్డకు రెండు కిలోమీటర్ల దూరంలోని కర్ణమామిడి



దానిమ్మ పండు.. ఆరోగ్యం మెండు..

దిలావర్‌పూర్: దానిమ్మ ఆరోగ్యానికి అమ్మలాంటిది. పండ్లలో దీనికి ప్రత్యేక స్థానముంది. ఆరోగ్య సంరక్షణకూ, అనారోగ్య చికిత్సకూ దానిమ్మ తోడ్పడుతుంది. అన్ని కాలాల్లోనూ లభించే ఈ పండులో అనేక ఔషధ గుణాలుంటాయి. దానిమ్మ గింజలను నేరుగా తినడంతో పాటు జ్యూస్‌గానూ స్వీకరించవచ్చు. ఈ పండులోని అన్ని భాగాలూ ఉపయోగపడేవే కావడం విశేషం.

● దానిమ్మలో ఔషధ గుణాలు..

దానిమ్మలో ఔషధ గుణాలు మెండుగా ఉంటాయి. ప్రధానంగా జీర్ణవ్యవస్థకు సంబంధించిన అనేక సమస్యల నివారణలో దానిమ్మను ఔషధంగా వాడుతారు. ఇది తీసుకువచ్చేందుకు దానిమ్మ తోడ్పడుతుంది. దానిమ్మ వేర్లు లేదంటే బెరడుకు నాలుగు రెట్లు నీరు పోసి, బాగా దంచి రసం తీయాలి. దీన్ని గంటకోసారి చొప్పున మూడుసార్లు తీసుకోవాలి. తర్వాత విరేచనాలు కావడానికి ఆముదం లేదా ఇతర ఔషధాలు వేసుకోవాలి. అప్పుడు విరేచనం ద్వారా టెప్‌వార్మ్ బయటకు వస్తాయి. వికారం, ఆకలి లేకపోవడం, కడుపులో మంటలాంటి సమస్యలున్నవారు. 10, 15 మిల్లీలీటర్ల దానిమ్మరసంలో సమానంగా తేనే కలుపుకొని రెండుమూడు సార్లు వాడాలి. దీంతో తక్షణం ఉపశమనం లభిస్తుంది. కొంతకాలం క్రమం తప్పకుండా వాడితే కడుపులో మంట పూర్తిగా తగ్గిపో తుంది. నీళ్ల విరేచనాలు లేదా జిగిట విరేచనాలవుతుంటే, దానిమ్మ రసాన్ని తీసుకుంటే తగ్గుతాయి. డీహైడ్రేషన్ సమస్య నుంచి కూడా మనల్ని కాపా డుతుంది. దానిమ్మ రసం జ్వరం తగ్గడానికి,


దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్‌లో దానిమ్మ తోట

గుండె, మూత్రపిండాలు, కాలేయా నికి మంచిటానిక్‌లా పని చేస్తుంది. వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. దానిమ్మ రసంలో శరీరానికి కావా ల్సిన అన్ని ఖనిజలవణాలు లభ్య మవుతాయి. దానిమ్మ బెరడు, ఆకులు, పూవులు, పండు మీది తొక్క, గింజలు, రసం అన్నింటి లోనూ ఔషధ గుణాలున్నాయి. అన్నిభాగాలనూ ఏదో రకంగా వాడుకోవచ్చు.

● దానిమ్మ ప్రయోజనాలు..

సాధారణంగా మాంసాహారం తినే వారిలో టెప్‌వార్మ్ అనే సూక్ష్మజీవి ఉండే అవకాశముంది. ఈ పురుగు కడుపులో, శరీరంలోని వివిధ భాగాల్లో ప్రవేశించి అనేక అనారోగ్య సమస్యలకు కారణమవు తాయి. కడుపులోని టెప్‌వార్మ్‌ను బయటకు జ్వరం వచ్చినప్పుడు నోటిలోని తడి ఆరిపోకుండా ఉండడానికి ఉపయోగ పడుతుంది.

● రాళ్లనూ బయటకు తీస్తుంది..

మూత్రపిండాలలో, మూత్రాశయంలో చిన్న చిన్న రాళ్లు ఉన్నవారు దానిమ్మ గింజలను ముద్దగా నూరి ఒక టీ స్పూన్ ముద్దను ఉలవచారుతో కలిపి ప్రతిరోజూ తాగితే రాళ్లు మూత్రం ద్వారా బయటకు వస్తాయి. చిగుళ్లు గట్టి పడటానికి, చిగుళ్ల నుంచి రక్తం కారకుండా ఉండడానికి, దంతాల ఆరోగ్యానికి దానిమ్మ పండు తొక్క ఎంతగానో ఉపకరిస్తుంది. తొక్కను ఎండ బెట్టి మిరయాలు, ఉప్పు చేర్చి చూర్ణంగా చేసి, దంతాలను శుభ్రం చేసు కుంటే దంతసమస్యలు దూరమవుతాయి.

ఆదివాసుల ఆశాజ్యోతి కోట్నాక భీంరావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న భీంరావు (ఫైల్)

- గిరిజనుల్లో మొదటి పట్ట భద్రుడు
- నేడు 15వ వర్ధంతికి ఏర్పాట్లు

ఆసిఫాబాద్ రూరల్: ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన కోట్నాక భీంరావు గిరిజనుల్లో మొదటి పట్టభద్రుడు. విద్య ద్వారా మాత్రమే గిరిజనాభివృద్ధి సాధ్యమని విశ్వసించినవారిలో ఆద్యులు. సమాజసేవే ధ్యేయంగా ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించి, తుదిశ్వాస విడిచేవరకు గిరిజనుల సంక్షేమానికి కృషి చేసి, వారి గుండెల్లో స్థానం సంపాదించుకున్న మహా మనిషి. ముగ్గురు ముఖ్యమంత్రుల హయాంలో గిరిజన సంక్షేమశాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించి, గిరిజనవిద్య, ఆర్థిక, సామాజికాభివృద్ధికి కృషి చేసిన భీంరావు 15 వర్ధంతిని ఘనంగా నిర్వహించేందుకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.


వాంకిడి మండలంలోని మారుమూల గిరిజన గ్రామం కోసారాలో భీంరావు జన్మించారు. కోట్నాక జంగు మోకాసి, బాదుబాయి దంపతుల ముగ్గురు సంతానంలో ఆయన రెండో వారు. చిన్నతనం నుంచే చదువుపై శ్రద్ధాసక్తులు కనబరిచారు. బీఏ న్యాయశాస్త్రంలో పట్టా పుచ్చుకున్నారు.


కోట్నాక భీంరావు(ఫైల్)

ఉద్యోగం కంటే ప్రజాసేవే మంచిదనే అభిప్రాయంతో రాజకీయాల్లో అడుగుపెట్టారు. 1962, 1967, 1972లో వరుసగా ఆసిఫాబాద్ నుంచి శాసనసభ్యుడిగా ఎన్నిక య్యారు. అనంతరం 1989లో ఖానాపూర్ నుంచి పోటీచేసి గెలుపొందారు. పీవీ నర్సింహా రావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్రి చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి సైతం గిరిజన సంక్షేమ మంత్రిత్వ బాధ్యతలను భీంరావుకు అప్పగించడం ఆయన క్రమశిక్షణ, చిత్తశుద్ధి, అంకితభావం, సేవాదృక్పథానికి నిదర్శనం. భీంరావు మంత్రిగా ఉన్న సమయంలో గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అడవిబిడ్డల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా భూములపై హక్కులు కల్పిం చారు. అలాగే గిరిజనుల్లో ఉన్న వెనకబాటుతనాన్ని రూపు మాపి చైతన్యవంతులను చేసే సత్తా ఒక్క చదువుకు మాత్రమే ఉందని బలంగా నమ్మిన భీంరావు, గిరిజన విద్యను ఎంతగానో ప్రోత్సహించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల స్థాపన భీంరావు హయాంలోనే జరిగింది. గిరి జన గ్రామాల్లో విద్యుత్, పారిశుధ్యం, గృహనిర్మాణాలపై ఆయన ప్రత్యేయక శ్రద్ధ చూపారు. ఆయన కృషితో గిరిజ నుల్లో విద్యాప్రమాణాలు పెరిగి అనేక మంది అడవిబిడ్డలు ఉద్యోగాలు సాధించడమేగాక ఆర్థికంగా నిలదొక్కుకోగలిగారు. గిరిజనులను రాజకీయంగా ప్రోత్సహిస్తేనే చైతన్యవంతులవుతారని గ్రహించిన భీంరావు.. రాజ్‌గోండ్ సేవా సమితి, అవ్వాల్ కమిటీ, రాయి సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆగస్టు 29, 2002న ఆయన కన్నుమూసేవరకూ గిరిజనుల సంక్షేమానికి కృషి చేసి, వారి గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారు. ఈమేరకు మంగళవారం ఆసిఫాబాద్ పట్టణంలోని జుబ్లీ మార్కెట్ రాయి సెంటర్‌లో భీంరావు 15వ వర్ధంతిని ఘనంగా జరిపేందుకు భీంరావు కూతురు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి ఏర్పాట్లు చేస్తు న్నారు. జిల్లాలోని గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై జయ ప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.


భీంరావును సన్మానిస్తున్న ఆదివాసులు(ఫైల్)

దారి కనుక్కోండి



జంబ్లింగ్ వర్డ్స్

1. LBIL ▶ ....
2. DEIS ▶ ....
3. WLLA ▶ ....
4. DERI ▶ ....

జంతర్ మంతర్

1. బంనుఅధం ▶ ....
2. తరంనిరం ▶ ....
3. లపొపాడి ▶ ....
4. చపందార ▶ ....

ఆకాశమే హద్దుగా..





నిండైన ఆత్మవిశ్వాసంతో.. ఏదైనా చేయగలను.. ఎప్పటికైనా సాధించగలను అని అడుగు ముందుకు వేస్తే... విధి వెక్కిరించినా.. సంకల్పంతో అనుకున్నది సాధిస్తే.. ఈ ప్రపంచమే నీకు సలామ్ చేస్తుంది. సమాజం కీర్తిస్తుంది. ప్రతి ఒక్కరూ నిన్ను చూసి స్ఫూర్తి పొందుతారు. పుట్టుకతోనే రెండు చేతులు లేకపోయినా ఏనాడూ అధైర్యపడలేదా చిన్నారి. వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఐదేళ్లకే సైకిల్ నేర్చుకుని ఔరా అనిపించుకుంది రూత్ ఎవ్లిన్ ప్రాంకే.

ఆమె పేరు రూత్ ఎవ్లిన్ ప్రాంకే. పుట్టుకతోనే చేతులు లేవు. కానీ ఆ చిన్నారిలో పట్టుదల మాత్రం కొండంత ఉంది. ఏదైనా చేయగలను అనే ఆత్మవిశ్వాసం ఆమె సొంతం. అందరిలానే తాను అన్ని పనులు చేసుకోగలదు. బ్రష్ చేసుకుంటుంది, బొమ్మలకు రంగులేస్తుంది, హోంవర్క్ అయితే సరేసరి! అన్నం కూడా తింటుంది. ఇటీవలే తాను సైకిల్ రైడ్ చేయడం కూడా నేర్చుకుంది. వైద్యులు ప్రత్యేకంగా రూపొందించిన 'బ్రేసెస్' ఆధారంగా రూత్ సైకిల్ హ్యాండిల్ చేస్తుంది. అమెరికాలోని మిన్నసోటాలో రూత్ కుటుంబం ఉంటుంది.

రూత్ సంకల్పానికి ఆమే కారణం

జెస్సికా కాక్స్‌కు కూడా పుట్టుకతోనే రెండు చేతులు లేవు. జీవితంలో ఎన్నో అవరోధాలు దాటి తనకంటూ ఓ స్థానం సంపాదించుకున్న ధీర వనిత ఆమె. ప్రపంచంలోనే తొలి 'ఆర్మ్‌లెస్ ఎయిరోప్లేన్ పైలట్'గా చరిత్ర సృష్టించింది. గ్రాడ్యుయేట్ డిగ్రీతో పాటు, తైక్వాండోలో బ్లాక్ బెల్ట్ సాధించింది. మోటివేషన్ స్పీకర్‌గా ఎంతోమందిలో స్ఫూర్తినింపుతోంది. 'దివ్యాంగుల'కు మెంటర్‌గా వ్యవహరిస్తోంది. పియానో అద్భుతంగా ప్లే చేస్తుంది. జెస్సికా జీవితకథ 'రైట్ ఫుటెడ్' పేరుతో డాక్యుమెంటరీగా వచ్చింది. రూత్ తల్లి కర్లీన్ 'జెస్సికా' గురించి చెప్పడంతో రూత్ ఆలోచనల్లో ఎంతో మార్పు వచ్చింది. ఆ చిన్నారి ఆ రోజు నుంచి జెస్సికాను కలవాలని ఉవ్విళ్లూరింది.

కల ఫలించింది.



కర్లీన్ తన కూతురు కోరిక తీర్చడానికి జెస్సికా గురించి గూగుల్‌లో ఎంతో శోధించింది. జెస్సికా ఫేస్‌బుక్ అకౌంట్ తెలుసుకుని తనతో మాట కలిపింది. తన కూతురు పరిస్థితి గురించి జెస్సికాకు వివరించింది. ఆ చిన్నారి కోరికనూ తెలియజేసింది. రూత్‌ను కలవడానికి జెస్సికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అంతే కూతురిని తీసుకుని కర్లీన్ అరిజోనాకు బయలుదేరింది. రూత్ కల ఫలించే సమయం రానే వచ్చింది. రూత్‌కు వంద అడుగుల దూరంలో జెస్సికా నిలుచుంది. ఒకరినొకరు చూసుకున్న ఆ ఇద్దరూ కొన్ని సెకన్ల పాటు నిశ్శబ్దంగా ఉండిపోయారు. రూత్, జెస్సికా దగ్గరికి ఆప్యాయంగా పరుగెత్తింది. చేతులు లేకపోతేనేం.. ప్రేమతో ఇద్దరూ ఆలింగనం చేసుకున్నారు. ఈ ఫొటో నెట్‌లో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

'రూత్‌ను చూడగానే నా చిన్నతనం గుర్తుకు వచ్చింది. నన్ను నేను మరోసారి తనలో చూసుకున్నాను. ఎంతో దూరం ప్రయాణించి నన్ను కలవడానికి వచ్చారు. ఆ ప్రేమను మాటల్లో చెప్పలేను. రూత్‌ను నాతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడింది. "నువ్వు నడిపే ఎయిర్‌ప్లేన్ ఏదీ" అని అడిగింది. వెంటనే తనను అక్కడికి తీసుకువెళ్లాను. అది చూసి రూత్ ఎంతో ఆనందించింది.'

- జెస్సికా కాక్స్

మీకు తెలుసా?



ఇంగ్లాండ్‌కు 600 ఏళ్లపాటు 'ఫ్రెంచ్' అధికార భాషగా కొనసాగింది.

టంగ్ ట్విస్టర్స్

